- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

సోమవారం
16-11-2026

సంపుటి : 01 సంచిక : 233 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 233 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

భారత గగనతలంలో చైనా యుద్ధ విమానం!

- సిక్కిం ప్రాంతంలోకి చొరబడి 25 నిమిషాల పాటు చక్కర్లు
- 25 వేల అడుగుల ఎత్తులో విమాన కదలికల గుర్తింపు
- వెనక్కి వెళ్లాలంటూ భారత వైమానిక దళం హెచ్చరికలు
- అత్యంత సున్నితమైన సిలిగురి కారిడార్ సమీపంలో కలకలం
- చికెన్స్ నెక్ ప్రాంతంపై భద్రతా వర్గాల అప్రమత్తత
- గతంలోనూ లద్దాఖ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో చైనా కదలికలు
- డోక్లామ్ సమీపంలో మరోసారి ఉద్రిక్తతలకు ఆస్కారం
- సరిహద్దు భద్రతపై నిఘా పెంచిన భారత బలగాలు



03

ఢిల్లీలో పెరుగుతున్న ఎయిర్ పొల్యూషన్

- 325కి పడిపోయిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్..
- వారం రోజులుగా వరుసగా క్షీణిస్తున్న వాతావరణ పరిస్థితులు
- నగరమంతటా దట్టంగా కమ్ముకుంటున్న పొగమంచు
- దారి కనిపించక వాహనదారుల ఇబ్బందులు
- బారాపుల్లా, జేఎల్ఎన్ స్టేడియం ప్రాంతాల్లో కాలుష్యం తీవ్రం
- ఢిల్లీ విశ్వవిద్యాలయం, పూసా, ధిర్‌పూర్ ప్రాంతాల్లోనూ అధ్వాన్న స్థితి
- నోయిడాలోనూ పెరిగిన కాలుష్య తీవ్రత
- 300 దాటితే అత్యంత అధ్వాన్నంగా పరిగణించే గాలి నాణ్యత



03

₹30 వేల కోట్లు.. కావాలి

- కరువు కాటుకు కేంద్రం అండ కావాలి..
- ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- రైతు రక్షణకు 30 వేల కోట్ల ప్యాకేజీ కోరిన రేవంత్
- కరువు నివారణకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కోరుతూ వినతి
- తుమ్మిడిహెట్టి, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి
- గోదావరి--కావేరి అనుసంధానంలో తెలంగాణకు 50 శాతం వాటా కోరిన సీఎం

తెలంగాణకు తక్షణ సాయం చేయండి

కరువు పరిస్థితులతో అల్లాడుతున్న తెలంగాణను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఎల్‌నినోతో ప్రభావంతో వర్షపాతం తగ్గి, సాగునీటి వనరుల్లో నీటి లభ్యత క్షీణించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కరువు నివారణ, రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్రానికి తక్షణమే రూ.30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో ఈ మేరకు వినతిపత్రం సమర్పించడంతో పాటు తుమ్మిడిహెట్టి, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు అనుమతులు, గోదావరి--కావేరి నదుల అనుసంధానంలో తెలంగాణకు 50 శాతం జలాల వాటా వంటి కీలక అంశాలను ప్రస్తావించారు.



03



03

టీమిండియా సంచలన విజయం

- వన్డే సిరీస్ కైవసం.. కివీస్ ఏడేళ్ల రికార్డుకు బ్రేక్
- న్యూజిలాండ్‌పై చివరి వన్డేలో 22 పరుగులరి తేడాతో గెలిచిన టీమిండియా
- సొంతగడ్డపై కివీస్ 7 ఏళ్ల సిరీస్ విజయాల రికార్డుకు బ్రేక్
- బ్యాటింగ్‌లో రాణించిన అక్షర్ పటేల్, ఇషాన్ కిషన్
- బౌలింగ్‌లో అదరగొట్టిన అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్
- హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్‌కు విదేశాల్లో తొలి సిరీస్ విజయం



03

రైల్వే పట్టాల పేలుడు కేసులో ఇద్దరి అరెస్ట్..

- పాక్ హ్యాండ్లర్లతో సంబంధాలు!



కాంగ్రెస్‌కు అధికారం కల్లే!

- కాంగ్రెస్ పార్టీ ప్రజల హృదయాల్లో స్థానం కోల్పోయింది
- రాహుల్ ప్రతిపక్ష నేతగా ఉన్నంతకాలం పునరాగమనం కష్టమే
- ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలకు బలమైన విశ్వాసం
- ప్రపంచ వేదికపై భారత్ ప్రతిష్ఠ పెరగాలంటే మోదీ కొనసాగాలి
- కాంగ్రెస్ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం లేదన్న ఈటల
- దేశవ్యాప్తంగా ఆ పార్టీకి ఆదరణ తగ్గిందని విమర్శ

హైదరాబాద్, నవంబర్ 15 (మహాప్రభ)

కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజల హృదయాల నుంచి ఎప్పుడో తొలగిపోయిందని, రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేతగా ఉన్నంతకాలం ఆ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని బీజేపీ నేత ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. నగరంలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా ఆ పార్టీకి ప్రజాదరణ తగ్గిపోయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు విశ్వాసం లేదని

-మిగతా 3 లో



అక్వాన్ తుపానుతో తెలంగాణకు వర్ష ముప్పు

- ఈ నెల 20న ఉత్తర కోస్తా తీరాన్ని దాటే అవకాశం
- 20 నుంచి 22 వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు
- తూర్పు, దక్షిణ తెలంగాణలో అధికంగా వర్షాలు కురిసే సూచనలు
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు భారీ వర్ష సూచన
- మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్‌పైనా ప్రభావం
- 21, 22 తేదీల్లో మిగతా జిల్లాల్లో మోస్తరు వర్షాలు
- వరి కోతలు, ధాన్యం కొనుగోళ్ల నేపథ్యంలో రైతులకు అప్రమత్తత సూచన

హైదరాబాద్, నవంబర్ 15 (మహాప్రభ)

బంగాళాఖాతంలో ఏర్పడనున్న అక్వాన్ తుపాను ప్రభావం తెలుగు రాష్ట్రాలపై పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ప్రముఖ వాతావరణ నిపుణుడు బాలాజీ తెలిపారు. తుపాను ప్రభావంతో ప్రస్తుతం కొనసాగుతున్న చలి వాతావరణంలోనూ మార్పులు చోటుచేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంచనాల ప్రకారం అక్వాన్ తుపాను ఈ నెల 20న ఉత్తర కోస్తా తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో తెలంగాణలోనూ దాని ప్రభావం కనిపించవచ్చని

-మిగతా 3 లో

చైనా సరికొత్త ప్రయోగం..

- సీఈ-25ప పేరుతో భారీ విద్యుత్ విమానం అభివృద్ధి
- సుమారు 10 టన్నుల బరువుతో రూపకల్పన
- 19 మంది ప్రయాణికులను తీసుకెళ్లే సామర్థ్యం
- ఒక్కసారి ఛార్జింగ్‌తో 400 కిలోమీటర్ల ప్రయాణం
- గంటకు 300 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే అవకాశం
- సుమారు 2,400 మీటర్ల ఎత్తులో ప్రయాణించేలా తయారీ
- భద్రతా పరీక్షలు, అనుమతులే కీలక సవాళ్లు

03

పైలట్ లేకుండానే ఎలక్ట్రిక్ విమానం!





03

నక్సల్స్ వల్లే గిరిజనులు ఓటుకు దూరం!

- ని మావోయిస్టు హింసతో గిరిజనుల జీవితాలు అంధకారం
- ఓటు హక్కును సైతం వినియోగించుకోలేని పరిస్థితులు
- హింస తగ్గడంతో గిరిజన ప్రాంతాల్లో మెరుగుపడిన భద్రత
- చిన్నారులకు విద్య.. మహిళలకు ఉపాధి అవకాశాలు
- మావోయిజం అంతంతోనే అభివృద్ధికి బాటలు
- గత 12--13 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు
- పేదలకు నాలుగు కోట్లకు పైగా పక్కా ఇళ్లు
- జాతీయ గిరిజన గౌరవ దినోత్సవంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

పదవుల గౌరవం ఏమైంది?

తెలంగాణ ఆత్మగౌరవం ఎక్కడంటూ కేటీఆర్ ప్రశ్న

- రాహుల్ పర్యటనలో సీఎం రేవంత్, మంత్రుల తీరుపై విమర్శలు
- రాహుల్ వెంట మంత్రులు పరుగులు తీయడంపై అభ్యంతరం
- అమిత్ షా చెప్పులు బండి సంజయ్ మోసుకెళ్లడంపైనా వ్యాఖ్యలు
- కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర నేతలు హోదా గౌరవాన్ని కాపాడుకోవాలని సూచన
- జాతీయ నాయకత్వం పట్ల గౌరవం పేరుతో ఆత్మగౌరవాన్ని తగ్గించుకోవద్దని హితవు

హైదరాబాద్, నవంబర్ 15 (మహాప్రభ)

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీ నేతల వ్యవహారశైలిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కీలక పదవుల్లో ఉన్న నాయకులు తమ హోదా, పదవుల గౌరవాన్ని మరిచి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన నేతలు ఇతర నాయకుల ముందు తమ స్థాయిని తగ్గించుకునేలా ప్రవర్తిస్తున్నారని ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించిన తీరును కేటీఆర్ తప్పుబట్టారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండాల్సిన రేవంత్‌రెడ్డి..

-మిగతా 3 లో



అవన్నీ తప్పుడు కథనాలు, నేను పనిచేస్తూనే ఉంటా..

- రిటైర్‌మెంట్ వార్తలపై నితిన్ గడ్కరీ..!



న్యూఢిల్లీ:నవంబర్ 15 (మహాప్రభ)

: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారంటూ వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. అవన్నీ తప్పుడు కథనాలని, ఆ కథనాల్లో ఎలాంటి నిజం లేదని అన్నారు. తన వ్యాఖ్యలను మీడియా వర్గాలు తప్పుగా అర్థం చేసుకున్నాయని పేర్కొన్నారు. 'నేను తరచూ యువతను ముందుకు తీసుకురావలని అంటుంటాను. దాని అర్థం నేను పదవి నుంచి, రాజకీయాల నుంచి తప్పుకుంటానని కాదు. ముందు తరాల వారు మనకు బాధ్యతలు ఎలాగైతే అప్పజెప్పారో.. అదేవిధంగా మనం కూడా మన తర్వాత తరాల వారికి బాధ్యతలు అందిద్దాం అనేది నా ఉద్దేశం' అని గడ్కరీ స్పష్టంచేశారు.ప్రస్తుతం ఉన్న జర్నలిస్టుల స్థానంలో ఇంతకుముందు వేరే వాళ్లు ఉండేవారని, ఇప్పుడు మీరు విలేకరులుగా చేస్తున్నారని గడ్కరీ మీడియా ప్రతినిధులను ఉద్దేశించి అన్నారు. మీలాగే నేను కూడా ప్రభుత్వం తరఫున పని చేస్తూనే ఉంటానని, గతంలో నేను చేసిన వ్యాఖ్యలకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అప్పుడు మాట్లాడింది నాగ్‌పుర్‌లో తాను ఏర్పాటుచేసిన లక్ష్మణ్‌రావ్ మన్కర్ ట్రస్ట్ గురించని తెలిపారు. ఆ ట్రస్టు కింద ఆదివాసీ ప్రాంతాల్లో విద్యాసంస్థలు నడుస్తున్నాయని అన్నారు. ట్రస్టు విషయంలో మునుపటిలా బాధ్యతలు నిర్వహించలేనని, అందుకే యువతరానికి అవకాశం ఇవ్వాలని ట్రస్టు సభ్యులకు సూచించానని గడ్కరీ చెప్పారు. కానీ మీడియా ఛానళ్లు ఆ వ్యాఖ్యలను రాజకీయాలతో ముడిపెట్టాయని అన్నారు.

మియామి ఎయిర్‌పోర్టులో రెండు విమానాలు ఢీ.. ఇద్దరికి గాయాలు..!



న్యూఢిల్లీ:నవంబర్ 15 (మహాప్రభ)

అమెరికా లో విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో శుక్రవారం తీవ్ర గందరగోళం నెలకొన్నది. శుక్ర, శనివారాల్లో విమానాశ్రయాల్లో లక్షలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఈ ఘటనను మరువకముందే శనివారం రాత్రి మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలోని టార్మాక్‌పై రెండు విమానాలు ఢీకొన్నాయి. రన్‌వేపై మలుపు తిరుగుతున్న ఒక విమానం రెక్క కొన వెనుకనున్న విమానం ముక్కుకు తగిలింది.శనివారం రాత్రి 9:15 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పనామా సిటీ నుంచి 166 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో వచ్చిన కోపా ఎయిర్‌లైన్స్ బోయింగ్ 737 విమానం రెక్క కొన.. ఎయిర్‌పోర్టు టాక్సీవేలపై కదులుతున్న యూపీఎస్ బోయింగ్ 767 కార్గో విమానం ముక్కును ఢీకొట్టిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారని కోపా ఎయిర్‌లైన్స్ ఆదివారం వెల్లడించింది. వారు చికిత్స పొందుతున్నారని ప్రాణాపాయం లేదని తెలిపింది. ఈ ఘటన జరిగినందుకు తాము చింతిస్తున్నామని పేర్కొన్నది.

ప్రపంచ నాయకుడిగా భారత్ ఎదగాలి



న్యూఢిల్లీ:నవంబర్ 15 (మహాప్రభ)

కేవలం సాంకేతికతను వినియోగించుకునే దేశంగా మాత్రమే కాకుండా, భవిష్యత్తులో అత్యాధునిక టెక్నాలజీలను స్వయంగా ఆవిష్కరించే సృష్టికర్తగా మరియు గ్లోబల్ లీడర్‌గా భారతదేశం ఆవిర్భవించాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గట్టిగా ఆకాంక్షించారు. దేశ రాజధానిలో జరిగిన ఒక ఉన్నత స్థాయి రక్షణ మరియు సాంకేతిక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రక్షణ రంగంతో పాటు అన్ని కీలక రంగాలలో స్వావలంబన సాధించడం ద్వారానే దేశ భద్రత మరియు ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు.ప్రపంచ దేశాల మధ్య సాంకేతిక ఆధిపత్యం కోసం తీవ్ర పోటీ నెలకొన్న ప్రస్తుత తరుణంలో, భారత్ తనదైన ముద్ర వేయాల్సిన సమయం ఆసన్నమైందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ మరియు అత్యాధునిక డిఫెన్స్ టెక్నాలజీల రూపకల్పనలో యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. మేక్ ఇన్ ఇండియా నినాదంతో రక్షణ రంగంలో దేశం ఇప్పటికే అనేక మైలురాళ్లను అధిగమించిందని, భవిష్యత్తులో దేశీయ పరిశ్రమలే ప్రపంచ దేశాలకు ఆయుధాలు మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశోధన మరియు అభివృద్ధి రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహిస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. విదేశీ సాంకేతికతపై ఆధారపడే పరిస్థితి నుండి పూర్తిగా బయటపడి, యువత నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని మరింత వేగంగా సాధించగలమని ఆయన నొక్కిచెప్పారు. ప్రభుత్వ విధానాలు మరియు శాస్త్రవేత్తల కృషి ఫలితంగా రాబోయే దశాబ్దంలో భారతదేశం ప్రపంచ టెక్నాలజీ పవర్‌హౌస్‌గా మారుతుందని ఆర్థిక, రక్షణ రంగ నిపుణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కుర్రాడు మరో ధోనీ అవుతాడా?

- -ధోనీ తరహాలోనే లక్ష్య రాయ్‌చందానీలో అద్భుతమైన ప్రశాంతత
- -ఆసియా కప్ గెలిచిన భారత అండర్-19 కెప్టెన్‌పై కోచ్ ప్రశంసలు
- -మ్యాచ్ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో లక్ష్యది ప్రత్యేక శైలి
- -దేశవాళీ, అంతర్జాతీయ యూత్ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శన
- -మైదానంలో దూకుడు కంటే వ్యూహాత్మక ఆలోచనలకే ప్రాధాన్యం



న్యూఢిల్లీ:నవంబర్ 15 (మహాప్రభ)

భారత అండర్-19 జట్టు కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీపై ఉత్తరాఖండ్ సీనియర్ పురుషుల జట్టు హెడ్ కోచ్ మనీష్ ఝా ప్రశంసల వర్షం కురిపించాడు. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండే తత్వం, మ్యాచ్ పరిస్థితులను చదివే అద్భుత నైపుణ్యం లక్ష్యను తోటి ఆటగాళ్ల కంటే ప్రత్యేకంగా నిలుపుతున్నాయని పేర్కొన్నాడు. ఇటీవల భారత జట్టు అండర్-19 ఆసియా కప్‌ను కైవసం చేసుకున్న నేపథ్యంలో, దేశవాళీ నుంచి అంతర్జాతీయ స్థాయికి వేగంగా ఎదుగుతున్న లక్ష్య నాయకత్వ లక్షణాలను మనీష్ ఝా ప్రత్యేకంగా ప్రస్తావించాడు. స్టార్ స్పోర్ట్స్ వీడియోలో మాట్లాడిన మనీష్ ఝా, టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వ శైలితో లక్ష్యను పోల్చాడు. "కొందరు ఆటగాళ్లు మైదానంలో దూకుడుగా కనిపిస్తారు, కొందరు పెద్దగా కనిపించకుండా తమ పనిని పూర్తి చేస్తారు. లక్ష్య గేమ్ సెన్స్ అద్భుతం. మ్యాచ్‌ను అతను అర్థం చేసుకునే తీరు చాలా బాగుంటుంది. తెరవెనుక ఉండి మొత్తం పనిని చక్కబెట్టే రకం అతను. సెంచరీ కొట్టినా సంబరాల్లో మునిగిపోడు, డకౌట్ అయినా కంగారుపడడు. ఎల్లప్పుడూ ఒకే రకమైన స్థితప్రజ్ఞతతో ఉంటాడు. ధోనీ కూడా మైదానంలో భావోద్వేగాలను పెద్దగా ప్రదర్శించేవారు కాదు. లక్ష్యలోనూ అదే ప్రశాంతత, స్పష్టత కనిపిస్తాయి" అని ఝా విశ్లేషించాడు. ఉత్తరాఖండ్ సీనియర్ డ్రెస్సింగ్ రూమ్‌లో లక్ష్య వ్యవహారశైలిని వివరిస్తూ.. అతను మైదానంలో అతిగా అరవడం లేదా హడావుడి చేయడం వంటివి చేయకపోయినా, తెరవెనుక కోచ్‌లతో స్పష్టమైన చర్చలు జరుపుతాడని చెప్పాడు. "వికెట్ పడగానే అతిగా ఎగ్జైట్ అవ్వడం లేదా ఎక్కువగా మాట్లాడటం అతనిలో కనిపించదు. చేతలతోనే తన పనిని చూపిస్తాడు. సీనియర్ జట్టుతో ఉన్నప్పుడు కూడా ఎంతో పరిణతితో, అర్థవంతంగా మాట్లాడతాడు. అతడు నిజంగా గొప్ప ప్రతిభావంతుడు" అని కొనియాడాడు. లక్ష్య ప్రదర్శనలు కూడా కోచ్ నమ్మకాన్ని నిజం చేస్తున్నాయి. 2025-26 రంజీ ట్రోఫీ సీజన్‌లో ఉత్తరాఖండ్ తరఫున 5 ఇన్నింగ్స్‌లలో 223 పరుగులు సాధించి సీనియర్ దేశవాళీ క్రికెట్‌లో తన సత్తా చాటాడు. నాకౌట్ దశల్లో బెంగాల్‌పై 86 పరుగులు, కర్ణాటకపై 55 పరుగులతో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. అనంతరం 2026 జులైలో శ్రీలంక పర్యటనతో అంతర్జాతీయ యూత్ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన లక్ష్య, యూత్ టెస్టుల్లో భారీ శతకాలతో చెలరేగాడు. గాలేలో జరిగిన తొలి మ్యాచ్‌లో సాగర్ విర్క్‌తో కలిసి మొదటి వికెట్‌కు 295 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి, 324 బంతుల్లో 207 పరుగులు చేశాడు. ఆ తర్వాత కొలంబోలో జరిగిన రెండో టెస్టులోనూ 116 బంతుల్లో 100 పరుగులు సాధించి అదరగొట్టాడు. అదే జోరును కొనసాగిస్తూ సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియా అండర్-19తో జరిగిన సిరీస్‌లో మూడో యూత్ వన్డేలో 110 పరుగులు, మొదటి యూత్ టెస్టులో 281 బంతుల్లో కెరీర్ బెస్ట్ 240 పరుగులు చేసి భారత్ ఇన్నింగ్స్ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. యూత్ వన్డే కెప్టెన్‌గా, యూత్ టెస్ట్ వైస్ కెప్టెన్‌గా రాణించిన లక్ష్య, తాజాగా భారత జట్టును అండర్-19 ఆసియా కప్ విజేతగా నిలపడం విశేషం. కేవలం పరుగుల గణాంకాలు మాత్రమే కాకుండా, అతనిలోని అవగాహన, మానసిక పరిణతి భారత క్రికెట్ భవిష్యత్తుకు ఎంతో కీలకమని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి

పోర్చుగల్‌లో భగ్గుమన్న గృహ సంక్షోభం..

- -30 నగరాల్లో రోడ్లపైకి వేలాది మంది ప్రజలు
- -పోర్చుగల్‌లో ఇళ్ల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా భారీ నిరసనలు
- -అద్దెల నియంత్రణ, అద్దెదారులకు రక్షణ కల్పించాలని వేలాది మంది డిమాండ్
- -2020 నుంచి అద్దెల వ్యయంలో ఏకంగా 68 శాతం పెరుగుదల నమోదు



న్యూఢిల్లీ:నవంబర్ 15 (మహాప్రభ)

పోర్చుగల్‌లో విపరీతంగా పెరిగిపోతున్న ఇళ్ల ధరలు, అద్దెలకు వ్యతిరేకంగా ప్రజాగ్రహం వెల్లువెత్తింది. దేశవ్యాప్తంగా 30కి పైగా నగరాలు, పట్టణాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి భారీ ప్రదర్శనలు చేపట్టారు. దేశ చరిత్రలోనే నివాస హక్కుల కోసం జరిగిన అతిపెద్ద నిరసనగా ఇది నిలిచింది. లిస్బన్, పోర్టో వంటి ప్రధాన నగరాల్లో విద్యార్థులు, యువత నుంచి పదవీ విరమణ చేసిన వృద్ధుల వరకు అందరూ రోడ్లపైకి వచ్చారు. 'మా నివాస హక్కును లాక్కోనివ్వం', 'అద్దెలు తగ్గించండి.. వేతనాలు పెంచండి' అంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. యూరోస్టాట్ గణాంకాల ప్రకారం... 2015 నుంచి 2025 మధ్య పోర్చుగల్‌లో సాధారణ ప్రజల ఆదాయంతో పోలిస్తే ఇళ్ల ధరలు ఏకంగా 61 శాతం పెరిగాయి. యూరోపియన్ యూనియన్‌లోనే ఇది అత్యధిక పెరుగుదల కావడం గమనార్హం. కేవలం 2025 తొలి త్రైమాసికం నుంచి 2026 తొలి త్రైమాసికం మధ్యే ఇళ్ల ధరలు దాదాపు 20 శాతం పెరిగాయని జాతీయ గణాంకాల సంస్థ వెల్లడించింది. మరోవైపు 2020 నుంచి ఇప్పటివరకు అద్దెలు 68 శాతం పెరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. విదేశీ కొనుగోలుదారులు, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్, డిజిటల్ నోమాడ్స్ తాకిడి పెరగడం, పర్యాటకం కారణంగా ఇళ్లను స్వల్పకాలిక అద్దెలకు ఇవ్వడం వంటి అంశాలు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేశాయి. దీనికితోడు యజమానులు అద్దెదారులను త్వరగా ఖాళీ చేయించేందుకు వీలుగా ప్రభుత్వం ఇటీవల తెచ్చిన నూతన బిల్లు ప్రజల ఆగ్రహాన్ని మరింత పెంచింది.ప్రజల ఆందోళనల నేపథ్యంలో పోర్చుగల్ అధ్యక్షుడు ఆంటోనియో జోస్ సెగురో ఉన్నత స్థాయి మండలితో సమావేశమై చర్చలు జరిపారు. కొందరు నిరసనకారులను కూడా ఆయన స్వయంగా కలిశారు. సంక్షోభాన్ని అదుపు చేసేందుకు కొత్త నిర్మాణాలకు పన్ను రాయితీలు ఇవ్వడంతో పాటు 1,45,000 కొత్త ఇళ్లను నిర్మిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఈ చర్యల ఫలితాలు కనిపించడానికి సమయం పడుతుందని అధికారులు స్పష్టం చేశారు.

దేశం పరువు తీస్తే అధికారం రాదు!

- -రాహుల్‌గాంధీకి అమిత్ షా ఘాటు వ్యాఖ్యలు
- -అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను విమర్శించడం వల్ల రాజకీయ లబ్ధి ఉండదని హితవు
- -ప్రజల మద్దతు పొందాలంటే వారి మధ్యకు వెళ్లాలని సూచన
- -హైదరాబాద్ భారత్ సమ్మిట్‌పైనా కేంద్ర హోంమంత్రి విమర్శలు



న్యూఢిల్లీ:నవంబర్ 15 (మహాప్రభ)

అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసినంత మాత్రాన రాజకీయంగా అధికారాన్ని సాధించలేరని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దేశ ప్రజల మద్దతు పొందాలంటే విదేశాల్లో భారత్‌పై విమర్శలు చేయడం కాకుండా, దేశ ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు, దేశ అభివృద్ధి, ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడానికి దేశంలో అనేక వేదికలు ఉన్నాయని, అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్టను ప్రశ్నార్థకం చేసేలా మాట్లాడటం వల్ల ఆశించిన రాజకీయ ప్రయోజనం ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భారత్ సమ్మిట్‌పైనా అమిత్ షా విమర్శలు గుప్పించారు. ఈ సదస్సుకు దేశవిదేశాల నుంచి వామపక్ష భావజాలానికి చెందిన ప్రతినిధులను ఆహ్వానించారని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్న ఈ వేదికను రాజకీయ విమర్శలకు ఉపయోగించుకున్నారని ఆయన ఆరోపించారు. సదస్సులో పాల్గొన్న రాహుల్‌గాంధీ భారత ప్రజాస్వామ్య వ్యవస్థలపై, ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై విమర్శలు చేశారని అమిత్ షా వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు పనిచేస్తున్న తీరు, ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతిపక్షాలకు భిన్నాభిప్రాయాలు ఉండవచ్చని, వాటిని ప్రజల ముందు చర్చించడం రాజకీయాల్లో సహజమని అమిత్ షా అభిప్రాయపడ్డారు. అయితే దేశానికి సంబంధించిన అంశాలను అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించేటప్పుడు జాతీయ ప్రయోజనాలు, దేశ ప్రతిష్టను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం కోసం దేశ ప్రతిష్టను పణంగా పెట్టకూడదని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ రాజకీయంగా ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే దేశంలోని వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అమిత్ షా సూచించారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు, రైతులు, కార్మికులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిపై ప్రజలతో చర్చించాలని అన్నారు. ప్రభుత్వ విధానాల్లో లోపాలుంటే వాటిని ఆధారాలతో ప్రజల ముందుంచి ప్రశ్నించాలని పేర్కొన్నారు. విదేశాల్లో భారత్‌పై విమర్శలు చేయడం ద్వారా ప్రజల మద్దతు లభించదని వ్యాఖ్యానించారు. భారత్ సమ్మిట్ నిర్వహణ, అందులో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అమిత్ షా చేసిన విమర్శలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య దేశ ప్రతిష్ట, ప్రజాస్వామ్య వ్యవస్థలు, అంతర్జాతీయ వేదికలపై రాజకీయ నాయకుల వ్యాఖ్యల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు

- -మృతుల కుటుంబాలకు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ పరిహారం ప్రకటన
- -క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సాయం
- -రెండు ప్రభుత్వ బస్సులు ఢీకొని ఐదుగురు మృతి
- -మరో 15 మందికిపైగా గాయాలు



న్యూఢిల్లీ:నవంబర్ 15 (మహాప్రభ)

అమృత్‌సర్: పంజాబ్‌లోని తరన్‌తారన్ జిల్లాలో రెండు ప్రభుత్వ బస్సులు ఢీకొన్న ప్రమాదంలో మరణించిన ఐదుగురి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటించారు. గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సాయం అందిస్తామన్నారు. నౌషెహ్రా పన్నూన్ సమీపంలోని జాతీయ రహదారి-54పై శనివారం ఈ ప్రమాదం జరిగింది. మోటార్‌సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో ఓ బస్సు డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు యాత్రికులు, మోటార్‌సైకిల్‌పై వెనుక కూర్చున్న మరో వ్యక్తి మృతిచెందగా, 15 మందికిపైగా గాయపడ్డారు. ఆదివారం అమృత్‌సర్ ఆస్పత్రిని సందర్శించిన భగవంత్ మాన్ క్షతగాత్రులను పరామర్శించి, ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రమాద సమయంలో రెండు బస్సుల్లో 37 మంది యాత్రికులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ తీర్థయాత్ర పథకం కింద ప్రయాణిస్తున్నారు.

ఢిల్లీలో పెరుగుతున్న ఎయిర్ పొల్యూషన్..



న్యూఢిల్లీ
దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతున్నది. గత వారం రోజులుగా గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) వరుసగా క్షీణిస్తుండటంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని పలు ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేస్తున్నది. దీనివల్ల రహదారులపై ఎదురుగా వస్తున్న వాహనాలు, దూరంలోని వస్తువులు స్పష్టంగా కనిపించడం లేదు. ముఖ్యంగా ఉదయం, రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజా గణాంకాల ప్రకారం ఢిల్లీలో సగటు గాలి నాణ్యత సూచీ 325కు పడిపోయింది. దీంతో నగరంలో కాలుష్య తీవ్రత ఆందోళనకరంగా మారింది. పలు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. బారాపుల్లా, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం పరిసరాల్లో గాలి నాణ్యత గణనీయంగా క్షీణించింది. ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రాంతం, పూసా, ధిర్‌పూర్ ప్రాంతాల్లోనూ గాలి నాణ్యత అత్యంత అధ్వాన్న స్థాయికి చేరింది. రాజధాని పరిసర ప్రాంతమైన నోయిడాలోనూ వాయు కాలుష్యం పెరిగింది. ఢిల్లీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ పొగమంచు, కాలుష్యం ప్రభావం కనిపిస్తున్నది. గాలిలో కాలుష్య కారకాలు పెరగడంతో సాధారణ జీవనంపై ప్రభావం పడుతున్నది. రహదారులపై ప్రయాణాలు ఇబ్బందికరంగా మారడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో సంచరించే ప్రజలు కూడా అసౌకర్యానికి గురవుతున్నారు..

టీమిండియా సంచలన విజయం..



న్యూఢిల్లీ,
మౌంట్ మాంగనూయిలోని బే ఓవల్ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో భారత జట్టు అద్భుత పోరాట పటిమ కనబరిచింది. తక్కువ స్కోరు నమోదైన ఉత్కంఠ పోరులో న్యూజిలాండ్‌పై 22 పరుగుల తేడాతో విజయం సాధించి, వన్డే సిరీస్‌ను 3-1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ విజయంతో కివీస్ గడ్డపై న్యూజిలాండ్‌కు ఉన్న సుదీర్ఘ అజేయ రికార్డుకు భారత్ తెరదించింది. గత ఏడేళ్లలో సొంతగడ్డపై వరుసగా 11 ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లను గెలుచుకున్న న్యూజిలాండ్‌కు ఇది ఊహించని షాక్. 2019 తర్వాత కివీస్ జట్టు తమ దేశంలో వన్డే సిరీస్ కోల్పోవడం ఇదే తొలిసారి కాగా, అప్పుడు కూడా భారత్ చేతిలోనే పరాజయం పాలవడం విశేషం. అంతేకాకుండా భారత హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గౌతమ్ గంభీర్‌కు విదేశాల్లో ఇదే తొలి వన్డే సిరీస్ విజయం. 210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 187 పరుగులకే కుప్పకూలింది. పిచ్ పరిస్థితులను సరిగ్గా అర్థం చేసుకున్న తాత్కాలిక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వ్యూహాత్మకంగా పేసర్లకే ఎక్కువ ఓవర్లు ఇచ్చాడు. 36వ ఓవర్ వరకు స్పిన్నర్లను తీసుకురాకుండా పేస్ ఎటాక్‌తోనే కివీస్ బ్యాటర్లను కట్టడి చేశాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3 వికెట్లతో రాణించగా, సిరాజ్ 2, అక్షర్ పటేల్ 2 వికెట్లు తీశారు. అరంగేట్రం చేసిన యశ్ ఠాకూర్, ఆకిబ్ నబీ తలో వికెట్ దక్కించుకున్నారు. కీలక సమయంలో నమన్ ధీర్ కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (24) వికెట్ తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. అంతకుముందు, టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 42.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌట్ అయింది. సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ (7), విరాట్ కోహ్లీ (5) తీవ్రంగా నిరాశపరిచారు. అయితే అక్షర్ పటేల్ (46), ఇషాన్ కిషన్ (46) బాధ్యతాయుతంగా ఆడి జట్టును ఆదుకున్నారు. ఆఖర్లో మహ్మద్ సిరాజ్ (14 నాటౌట్), అర్ష్‌దీప్ సింగ్ (14) చివరి వికెట్‌కు జోడించిన 28 పరుగులు మ్యాచ్ ఫలితంలో అత్యంత కీలకంగా మారాయి.

రైల్వే పట్టాల పేలుడు కేసులో ఇద్దరి అరెస్ట్..

-పాక్ హ్యాండ్లర్లతో సంబంధాలు!



చండీగఢ్
రైలు పట్టాలను పేల్చేసిన కేసులో ఒక మహిళ, ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి రెండు ఆయుధాలు, 46 కాట్రిడ్జ్‌లు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ మహిళకు పాకిస్థాన్‌తో సంబంధాలున్నట్లు పోలీస్ దర్యాప్తులో తేలింది. నవంబర్ 3న రాత్రి 9:45 గంటల సమయంలో రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లా రామ్‌సింగ్‌పూర్ సమీపంలోని రైలు పట్టాలపై పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి రెండు రైల్వే స్లీపర్లు ధ్వంసం కావడంతో పాటు రెండున్నర అడుగుల లోతులో ఒక గొయ్యి ఏర్పడింది. అక్కడి రైలు పట్టాలకు నష్టం వాటిల్లింది. ఈ పేలుడుకు 75 నిమిషాల ముందు అనూప్‌గఢ్-సూరత్‌గఢ్ ప్యాసింజర్ రైలు ఈ ట్రాక్‌పై ప్రయాణించింది. నిందితులు ఈ రైలును పేల్చేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు అనుమానించారు.

కాంగ్రెస్‌కు అధికారం కల్లే!

(మొదటి తరువాయి)

ఈటల రాజేందర్ అన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించడంలో ఆ పార్టీ నాయకత్వం విఫలమైందని విమర్శించారు. రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్నంతకాలం కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా పునరుజ్జీవం లభించే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ప్రజల మనసుల్లో స్థానం కోల్పోయిన పార్టీకి తిరిగి ఆదరణ పొందడం అంత సులభం కాదని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ఠ, గౌరవం, కీర్తి మరింత పెరగాలంటే నరేంద్ర మోదీ ప్రధానిగా కొనసాగాల్సిన అవసరం ఉందని దేశ ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని ఈటల పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ గౌరవాన్ని పెంచడంతోపాటు దేశ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లగల నాయకత్వంపై ప్రజలకు స్పష్టమైన అభిప్రాయం ఉందన్నారు. మోదీ నాయకత్వం కొనసాగాలన్నదే దేశ ప్రజల ఆకాంక్షగా అభివర్ణించారు. దేశ అభివృద్ధి, ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలు, అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠ వంటి అంశాల్లో ప్రజలకు స్పష్టత ఉందని ఆయన అన్నారు. మోదీ నాయకత్వంలో దేశం మరింత పురోగతి సాధిస్తుందన్న నమ్మకం ప్రజల్లో ఉందని పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ నాయకత్వంపై విశ్వాసం లేకపోవడం వల్లే ఆ పార్టీకి దేశవ్యాప్తంగా ఆదరణ కరువైందని ఈటల రాజేందర్ విమర్శించారు.

భారత గగనతలంలో చైనా విమానం!

- సిక్కిం ప్రాంతంలోకి చొరబడి 25 నిమిషాల పాటు చక్కర్లు
- 25 వేల అడుగుల ఎత్తులో విమాన కదలికల గుర్తింపు
- వెనక్కి వెళ్లాలంటూ భారత వైమానిక దళం హెచ్చరికలు
- అత్యంత సున్నితమైన సిలిగురి కారిడార్ సమీపంలో కలకలం
- చికెన్స్ నెక్ ప్రాంతంపై భద్రతా వర్గాల అప్రమత్తత
- గతంలోనూ లద్దాఖ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో చైనా కదలికలు
- డోక్లామ్ సమీపంలో మరోసారి ఉద్రిక్తతలకు ఆస్కారం
- సరిహద్దు భద్రతపై నిఘా పెంచిన భారత బలగాలు



న్యూఢిల్లీ: చైనా మరోసారి భారత గగనతలంలోకి చొరబడినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 12న చైనాకు చెందిన ఓ సైనిక విమానం సిక్కిం ప్రాంతంలోని భారత గగనతలంలోకి ప్రవేశించి సుమారు 20 నుంచి 25 నిమిషాల పాటు చక్కర్లు కొట్టినట్లు తెలిపాయి. ఉదయం 8 గంటల సమయంలో 25 వేల అడుగుల ఎత్తులో విమాన కదలికలను భారత వైమానిక దళం గుర్తించినట్లు పేర్కొన్నాయి. వెంటనే అప్రమత్తమైన అధికారులు భారత గగనతలం నుంచి వెనక్కి వెళ్లాలని పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించాయి. దేశ భద్రతాపరంగా అత్యంత సున్నితమైన సిలిగురి కారిడార్‌కు అభిముఖంగా ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ఉన్న సిలిగురి కారిడార్ భారతదేశానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన భూభాగం. అత్యంత సన్నని ప్రాంతంలో దీని వెడల్పు సుమారు 20 నుంచి 22 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈశాన్య రాష్ట్రాలను దేశంలోని మిగిలిన ప్రాంతాలతో అనుసంధానించే ఈ మార్గాన్ని 'చికెన్స్ నెక్' అని కూడా పిలుస్తారు. చైనా, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ దేశాలకు సమీపంలో ఉండటంతో ఇక్కడ జరిగే సైనిక కార్యకలాపాలను భద్రతా సంస్థలు నిశితంగా పరిశీలిస్తుంటాయి. సిక్కిం రాష్ట్రం చైనాలోని టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతంతో సరిహద్దును పంచుకుంటుంది. వ్యూహాత్మకంగా కీలకమైన డోక్లామ్ పీఠభూమి కూడా దీనికి సమీపంలోనే ఉంది. సరిహద్దుల్లో చైనా సైనిక విమానాల కదలికలు ఆందోళన కలిగించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన సందర్భాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. 2022 జూన్‌లో తూర్పు లద్దాఖ్‌లో భారత సైనిక స్థావరాలకు అత్యంత సమీపంగా చైనా సైనిక విమానం ప్రయాణించింది. భూతల సిబ్బంది, భారత రాడార్లు ఆ కదలికలను గుర్తించడంతో వైమానిక దళం అప్రమత్తమైంది. ఈ ఘటనపై భారత్ సైనిక మార్గాల ద్వారా చైనాకు తన అభ్యంతరాలను తెలియజేసింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లో ఇరు దేశాల మధ్య సైనిక ప్రతిష్టంభన కొనసాగుతున్న సమయంలో చైనా హెలికాప్టర్లు వాస్తవాధీన రేఖకు సమీపంలో సంచరిస్తూ కనిపించాయి. ఎలాంటి చొరబాట్లనైనా అడ్డుకునేందుకు భారత వైమానిక దళం యుద్ధ విమానాలను రంగంలోకి దించింది. అయితే ఆ హెలికాప్టర్లు భారత గగనతలంలోకి ప్రవేశించలేదని అధికారులు తెలిపారు. 2017 అక్టోబరు 11న ఉత్తరాఖండ్‌లోని బరాహోటి ప్రాంతంలో రెండు చైనా హెలికాప్టర్లు చొరబడినట్లు సమాచారం వెలువడింది. తాజాగా ఈ నెల 7న లద్దాఖ్‌లో నాలుగు చైనా హెలికాప్టర్లు చొరబడినట్లు కూడా వెల్లడైంది. వరుస పరిణామాల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో చైనా సైనిక కదలికలపై భారత భద్రతా సంస్థలు నిఘా కొనసాగిస్తున్నాయి.

30 వేల కోట్లు.. కావాలి

- తెలంగాణకు తక్షణ సాయం చేయండి
- కరువు కాటుకు కేంద్రం అండ కావాలి..
- -ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- రైతు రక్షణకు 30 వేల కోట్ల ప్యాకేజీ కోరిన రేవంత్
- కరువు నివారణకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కోరుతూ వినతి
- తుమ్మిడిహెట్టి, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి
- -గోదావరి--కావేరి అనుసంధానంలో తెలంగాణకు 50 శాతం వాటా కోరిన సీఎం



న్యూఢిల్లీ,
కరువు పరిస్థితులతో సతమతమవుతున్న తెలంగాణను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్రానికి తక్షణమే రూ.30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని, సాగునీటి వనరుల్లో నీటి లభ్యత తగ్గడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కరువు నివారణ చర్యలకు కేంద్రం తక్షణ సాయం అందించాలని కోరారు.ఆదివారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు, నిధుల కేటాయింపు, అంతర్రాష్ట్ర జల వివాదాలు తదితర అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం వల్ల వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడిందని ముఖ్యమంత్రి వివరించారు. సాగునీటి వనరుల్లో నీరు తగ్గడంతో రైతులు పంటల సాగు విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు, రైతులకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ అవసరమని పేర్కొన్నారు. రూ.30 వేల కోట్ల సాయం అందిస్తే కరువు నివారణ, సాగునీటి అవసరాలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన కార్యక్రమాలను చేపట్టేందుకు వీలవుతుందని వివరించారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన కేంద్ర ప్రభుత్వ అనుమతులను త్వరగా మంజూరు చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు. ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు మహారాష్ట్ర ప్రభుత్వ సమ్మతి పొందేందుకు కేంద్రం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రంలోని సాగునీటి అవసరాలకు మరింత భరోసా లభిస్తుందని వివరించారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు విషయంలోనూ కేంద్రం సహకారం అందించాలని సీఎం కోరారు. ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం అనుమతులను త్వరగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నిర్మాణానికి అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఇప్పించేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. అంతర్రాష్ట్ర సమన్వయంతో అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గోదావరి--కావేరి నదుల అనుసంధాన ప్రతిపాదనపైనా ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను ప్రధాని ముందు ఉంచారు. ఈ ప్రాజెక్టు అమలులో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని కోరారు. అనుసంధానం ద్వారా లభించే జలాల్లో రాష్ట్రానికి 50 శాతం వాటా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని కోరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, తెలంగాణలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని ప్రధాని మోదీని రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు రాష్ట్రంలో నిర్వహించనున్న ఖోలో ఇండియా యువ క్రీడల ప్రారంభోత్సవ వేడుకలకు కూడా రావాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, క్రీడారంగ ప్రోత్సాహానికి సంబంధించిన కార్యక్రమాల్లో ప్రధాని భాగస్వామి కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు

అక్వాన్ తుపానుతో తెలంగాణకు వర్ష ముప్పు

(మొదటి తరువాయి)

బాలాజీ వివరించారు. ముఖ్యంగా తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండవచ్చని తెలిపారు. తుపాను కదలికలు, వాతావరణ పరిస్థితులను బట్టి వర్షాల విస్తీర్ణం, తీవ్రతలో మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించారు. మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడవచ్చని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ నెల 21, 22 తేదీల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ తుపాను ప్రభావం కనిపించవచ్చని, పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. తుపాను ప్రభావంతో మేఘావృత వాతావరణం, వర్షాలు ఏర్పడితే ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు చోటుచేసుకోవచ్చని అంచనా వేస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు తాజా సూచనలను గమనించాలని నిపుణులు చెబుతున్నారు. వర్ష సూచన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో వరి కోతలు కొనసాగుతుండగా, మరికొన్ని చోట్ల ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ సమయంలో వర్షాలు కురిస్తే కోసిన పంట, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పరదాలతో కప్పి ఉంచడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కూడా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ధాన్యం నిల్వ చేసే ప్రదేశాల్లో తగిన ఏర్పాట్లు చేసుకోవడంతో పాటు, వర్షం కారణంగా రైతులకు నష్టం కలగకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచిస్తున్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనించాలని, వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకుండా జాగ్రత్త పడాలని బాలాజీ సూచించారు

నక్సల్స్ వల్లే గిరిజనులు ఓటుకు దూరం!



గడ్చిరోలి,
దేశంలో మావోయిస్టు హింస తగ్గుముఖం పట్టడంతో గిరిజన ప్రాంతాల్లో భద్రతతోపాటు విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గిరిజనులు కనీసం తమ ఓటు హక్కును కూడా వినియోగించుకోలేని పరిస్థితులు ఉండేవని పేర్కొన్నారు. హింసాత్మక ఘటనల కారణంగా వారి జీవితాలు అంధకారంలోకి నెట్టబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ గిరిజన గౌరవ దినోత్సవ కార్యక్రమంలో మహారాష్ట్రలోని గడ్చిరోలి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వాలు గిరిజనుల సమస్యలను పట్టించుకోకుండా ప్రేక్షకులుగా మిగిలిపోయాయని మోదీ విమర్శించారు. ప్రస్తుతం మావోయిస్టు హింస తగ్గడంతో గిరిజనులకు రక్షణ లభిస్తోందని, చిన్నారులు పాఠశాలలకు వెళ్తున్నారని, మహిళలకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. గిరిజన మహిళ ద్రౌపది ముర్ము దేశ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. గిరిజనుల అభ్యున్నతికి భద్రత, విద్య, ఉపాధి కీలకమని స్పష్టం చేశారు.

చైనా సరికొత్త ప్రయోగం..



బీజింగ్
విమానయాన రంగంలో సరికొత్త సాంకేతిక ప్రయోగానికి చైనా శ్రీకారం చుట్టింది. సంప్రదాయ ఇంధన విమానాలకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఆధారిత విమానాల తయారీపై దృష్టి సారించిన ఆ దేశం.. తాజాగా సీఈ-25ఏ పేరుతో భారీ ఎలక్ట్రిక్ విమానాన్ని అభివృద్ధి చేసినట్లు ప్రకటించింది. సుమారు 10 టన్నుల బరువున్న ఈ విమానాన్ని పైలట్ అవసరం లేకుండా స్వయంచాలకంగా ప్రయాణించే సామర్థ్యంతో రూపొందించినట్లు సమాచారం. విద్యుత్ ఆధారిత చోదక వ్యవస్థలు, స్వయంచాలక నియంత్రణ, కృత్రిమ మేధ సాంకేతికతలను సమన్వయం చేయడం ఈ ప్రయోగంలో ప్రత్యేకతగా నిలుస్తోంది. అయితే ఈ విమానం పూర్తిగా పైలట్ లేకుండా వాణిజ్య ప్రయాణాలు ప్రారంభించిందని భావించరాదు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న తొలిసారిగా సిబ్బంది లేకుండా స్వయంచాలకంగా ప్రయాణించింది. అప్పటి నుంచి మొత్తం 19 మానవ రహిత పరీక్షా ప్రయాణాలను పూర్తి చేసింది. తాజాగా నవంబర్ 14న షాండోంగ్ ప్రావిన్స్‌లోని బిన్‌జౌ నగరంలో ఇద్దరు పైలట్లు, ఒక విమాన పరీక్షా ఇంజినీర్‌తో కలిసి తొలి సిబ్బందితో కూడిన పరీక్షా ప్రయాణాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయాణంలో విమానం 60.4 కిలోమీటర్లు ప్రయాణించింది. 16 నిమిషాల 38 సెకన్ల పాటు గాలిలో ఉంది. విమానంలోని వ్యవస్థలన్నీ సాధారణంగా పనిచేశాయని తయారీ సంస్థ తెలిపింది. ఈ విమానాన్ని చైనాకు చెందిన వాణిజ్య విమానాల తయారీ సంస్థ కామ్‌క్ (కమర్షియల్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ ఆఫ్ చైనా) అభివృద్ధి చేసింది. చైనా బ్యాటరీ తయారీ సంస్థ క్యాటిల్, షాంఘై జియావో టోంగ్ విశ్వవిద్యాలయం తదితర సంస్థలు కూడా ఈ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్నాయి. రెక్కలపై అమర్చిన విద్యుత్ ఆధారిత ప్రత్యేక గాలి చోదక వ్యవస్థలు ఈ విమానానికి శక్తిని అందిస్తాయి.

పదవుల గౌరవం ఏమైంది?

(మొదటి తరువాయి)

రాహుల్‌గాంధీ కుటుంబానికి బాడీగార్డుగా మారిపోయారని విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సమస్యలపై దృష్టి సారించాల్సిన వ్యక్తి రాహుల్ వెంట రక్షణ సిబ్బందిలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు సైతం రాహుల్‌గాంధీ బైక్ ర్యాలీ సందర్భంగా ఆయన వెంట పరుగులు తీయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల చేత ఎన్నికై కీలక పదవుల్లో ఉన్న మంత్రులు, పార్టీ అధ్యక్షులు ఒక జాతీయ నాయకుడి వెంట సెక్యూరిటీ సిబ్బందిలా పరుగులు తీయాల్సిన అవసరం ఏమొచ్చిందని కేటీఆర్ నిలదీశారు. జాతీయ నాయకత్వం పట్ల గౌరవం ఉండటం వేరని, ఆ గౌరవం పేరుతో రాష్ట్ర నేతలు తమ ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టడం వేరని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి సహా రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తమ హోదా గౌరవాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఇదే సందర్భంలో బీజేపీ నేతలపైనా కేటీఆర్ విమర్శలు చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పులను కేంద్ర మంత్రి బండి సంజయ్ మోసుకెళ్లిన ఘటనను ప్రస్తావించారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మరో నాయకుడి చెప్పులు మోయడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా రాష్ట్ర ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న బండి సంజయ్ తన పదవికి తగిన గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం లేదా అని నిలదీశారు. ఈ ఘటన రాష్ట్ర బీజేపీ నేతల స్వతంత్ర వ్యవహారశైలిపై ప్రశ్నలు లేవనెత్తుతోందని విమర్శించారు. తెలంగాణ అనేది కేవలం భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని, ఆత్మగౌరవమే రాష్ట్ర ప్రజల అస్తిత్వానికి పునాది అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆత్మగౌరవం కీలక ఆకాంక్షగా నిలిచిందని గుర్తుచేశారు. అలాంటి చరిత్ర కలిగిన రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నేతలు ఇతరుల ముందు తమ హోదాను తగ్గించుకునేలా వ్యవహరించడం సరికాదని అన్నారు. పదవులు అలంకారప్రాయంగా కాకుండా ప్రజల గౌరవాన్ని నిలబెట్టే బాధ్యతగా ఉండాలని వ్యాఖ్యానించారు.



ప్రశ్నించే గొంతులంటే భయమా?



ప్రజాస్వామ్య బలం అధికారంలో కాదు.. ఆ అధికారాన్ని ప్రశ్నించే స్వరాలను ఎంత స్వేచ్ఛగా అనుమతిస్తుందన్న దానిలో ఉంటుంది. ప్రభుత్వాన్ని ప్రశంసించే గొంతుకలకు వేదికలు కల్పించడం సులభం. కానీ ప్రభుత్వ విధానాలను విమర్శించే జర్నలిస్టులు, మేధావులు, భిన్నాభిప్రాయాలు కలిగిన వ్యక్తులకు కూడా సమాన స్వేచ్ఛ కల్పించినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం ఉంటుంది. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ 2026 చుట్టూ తలెత్తిన విదేశీ ప్రతినిధుల వీసా వివాదం ఇప్పుడు ఈ మౌలిక ప్రశ్ననే దేశం ముందుంచింది. భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఆహ్వానించిన విదేశీ ప్రతినిధుల్లో కొందరికి వీసాలు నిరాకరించారని, మరికొందరి అనుమతులు రద్దయ్యాయని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్, రాష్ట్ర రేవంత్ రెడ్డి ఆరోపించారు. థరూర్ ప్రకారం, 315 మంది వక్తల్లో 115 మంది భారత్‌కు రాలేకపోయారు. విదేశీయులకు వీసాలు మంజూరు చేయడం, నిరాకరించడం ఏ దేశానికైనా సార్వభౌమాధికార పరిధిలోని అంశమే. భద్రత, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవచ్చు.కానీ ఒకసారి అనుమతులు ఇచ్చిన తర్వాత వాటిని రద్దు చేస్తే, దానికి కారణాలు వివరించాల్సిన బాధ్యత లేదా?వీసా నిర్ణయాలు సార్వభౌమాధికార అంశం అని చెప్పడం అధికార పరిధిని తెలియజేస్తుంది. కానీ నిర్ణయం న్యాయసమ్మతమైనదా,పారదర్శకమైనదా అన్న ప్రశ్నకు సమాధానం కాదు. భద్రతా రహస్యాలను వెల్లడించాల్సిన అవసరం లేకపోయినా, సాధారణ కారణాలను, చట్టపరమైన ప్రక్రియను వివరించడం ప్రజాస్వామ్య జవాబుదారీతనం. నార్వేకు చెందిన జర్నలిస్టు హెలె లింగ్ స్వెండ్సెన్‌కు భారత్ సమ్మిట్‌లో పాల్గొనే అవకాశం దక్కలేదనే వివాదం కూడా చర్చకు వచ్చింది. మే 2026లో ప్రధాని మోడీని జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారా అని ఆమె ప్రశ్నించిన విషయం ప్రస్తావనకు వచ్చింది. ఒక జర్నలిస్టు ప్రధానమంత్రిని ప్రశ్నించడం దేశ వ్యతిరేక చర్య కాదు. ప్రభుత్వ విధానాలను విమర్శించడం దేశద్రోహం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం హక్కు మాత్రమే కాదు.. అధికారాన్ని జవాబుదారీగా ఉంచే కీలకమైన ప్రక్రియ. హైదరాబాద్‌లో అంతర్జాతీయ సమావేశం నిర్వహించడం తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురాగల అవకాశం. కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పార్టీల పాలనలో ఉన్నా, అంతర్జాతీయ కార్యక్రమాల నిర్వహణలో సమన్వయం అవసరం. రాజకీయ విభేదాల కారణంగా రాష్ట్ర ప్రణాళికలు దెబ్బతినకూడదు. విదేశీయుల ప్రవేశంపై కేంద్రానికి అధికారం ఉన్నప్పటికీ, ముందస్తు సమాచారం, స్పష్టమైన మార్గదర్శకాలు, పరస్పర సహకారం తప్పనిసరి. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా గుర్తింపు పొందుతోంది. అంతర్జాతీయ వేదికలపై స్వేచ్ఛ, మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడుతోంది అలాంటి దేశంలో విమర్శనాత్మక స్వరాల ప్రవేశంపై వివాదం తలెత్తడం దేశ ప్రతిష్ఠకు సంబంధించిన అంశం. కేంద్ర ప్రభుత్వానికి భద్రతాపరమైన కారణాలు ఉంటే వివరించాలి. వీసా అనుమతులు రద్దు చేయడానికి కారణాలు వెల్లడించాలి. ప్రక్రియలో లోపాలు ఉంటే సరిదిద్దాలి. విమర్శలను రాజకీయ ప్రత్యర్థుల ప్రచారంగా కొట్టిపారేయడం సులభం. కానీ పారదర్శకమైన సమాధానం ఇవ్వడం నిజమైన ప్రజాస్వామ్య నాయకత్వానికి నిదర్శనం.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం తప్పులు చేయవచ్చు. కానీ తప్పులను ప్రశ్నించే స్వరాలను అణచివేయకూడదు. దేశ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. సార్వభౌమాధికారాన్ని కాపాడాలి. కానీ వాటి పేరుతో ప్రజాస్వామ్య స్వేచ్ఛను అనవసరంగా కుదించకూడదు. ప్రశ్నించే గొంతుకలను అనుమతించని ప్రజాస్వామ్యం.. ప్రజాస్వామ్యంగా మిగలదు. విమర్శను శత్రుత్వంగా చూడని ప్రభుత్వం, భిన్నాభిప్రాయాన్ని ప్రజాస్వామ్య సంపదగా గుర్తించే పాలన మాత్రమే దేశానికి నిజమైన బలం

భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా శ్రీశైలంలో ఆకస్మిక తనిఖీలు

-పారిశుద్ధ్యం, వసతి సదుపాయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు

శ్రీశైలం, నవంబర్ 15 (మహాప్రభ)
శ్రీశైల క్షేత్రానికి విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు శనివారం సాయంత్రం దేవస్థాన పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వివిధ వసతి సముదాయాలు, భవనాలు, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా కల్యాణకట్ట ప్రాంగణ పరిసరాలు, శివసేవకుల డార్మెటరీలు, శివదీక్షా శిబిరాలు, సిద్ధిరామప్ప వాణిజ్య సముదాయ పరిసరాలు, మల్లికార్జున సదన్, గణేశ్ ఫుడ్ కోర్ట్, గణేశ సదన్, నక్షత్రవనం తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ దేవస్థాన పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వసతి సముదాయాలు, భవనాలు, ఆరుబయలు ప్రదేశాల్లో నిరంతరం పరిశుభ్రత పనులు చేపట్టాలని, సిబ్బంది



భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. శివసేవకుల డార్మెటరీల్లో వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మల్లికార్జున సదన్, గణేశ సదన్ తదితర వసతి భవనాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అవసరమైన మరమ్మతులను ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. వసతి గదుల్లో ఏసీలు, ఫ్యాన్లు, గీజర్లు సక్రమంగా పనిచేసేలా రోజువారీ పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. భక్తులు గదులు, కాటేజీలు ఖాళీ చేసిన వెంటనే ఆలస్యం చేయకుండా శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం ఈఓ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ సిబ్బంది విధుల్లో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కేశఖండన కోసం వచ్చే భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కల్యాణకట్టతో పాటు అన్ని భవనాల్లో విద్యుద్దీపాలు, ఫ్యాన్లు సక్రమంగా పనిచేసేలా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది విధిగా ఏకరూప దుస్తులతో పాటు గుర్తింపు కార్డులు ధరించాలని సూచించారు. భక్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. భవన ప్రాంగణాల్లో ఫ్లోరింగ్ తదితర ప్రాంతాల్లో అవసరమైన మరమ్మతులను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అలాగే క్షేత్ర పరిధిలోని శౌచాలయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటిని నిరంతరం శుభ్రంగా ఉంచేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. భవన సముదాయాలు, ఆరుబయలు ప్రదేశాల్లో మరిన్ని మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని ఆదేశించారు.ఈ ఆకస్మిక తనిఖీల్లో సహాయ కార్యనిర్వహణాధికారులు యం. ఫణిధర ప్రసాద్, కె. వెంకటేశ్వరరావు, సి.హెచ్. శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చంద్రశేఖరశాస్త్రి, పి.వి. సుబ్బారెడ్డి, పర్యవేక్షకులు బి. శ్రీనివాసులు, పి. రాజశేఖర్, సంబంధిత సహాయక ఇంజనీర్లు, ఉద్యానవన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలానికి సర్పంచుల పదవులు!

- విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్

గుంతకల్లు, నవంబర్ 15 (మహాప్రభ)
గతంలో ఎన్నడు లేని విధంగా ప్రస్తుతం జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అప్రజాస్వామిక ధోరణిని అవలంబించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం గుంతకల్లు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం జరగనున్న సర్పంచ్ ఎన్నికలను కూటమి నేతలు వేలం వేయడం విడ్డూరంగా ఉందన్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ తరహాలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం సిగ్గుచేటుగా ఉందన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం పోరాడి తెలుగుదేశం పార్టీని స్థాపించిన స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయాలకు ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు తూట్లు పొడుస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల పేరుతో నామినేషన్ల పర్వం మొదలుకొని, పోలింగ్ ఘట్టాల వరకు మొత్తం దౌర్జన్యపూరితంగా అప్రజాస్వామికంగా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీష్

వ్యవహరించారని ఆయన దుయ్యబట్టారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఒక్క శాతం దౌర్జన్యానికి పాల్పడితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వంద శాతం పోలింగ్ అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. ఈ ఎన్నికల నిర్వహణకు బదులు అంటే ఎలక్షన్ అనేకంటే మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి అనుకూలురైన వారిని సెలక్షన్ చేస్తే సరిపోయేది కదా అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికలను వేలం వేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుత ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కడం గర్హనీయమన్నారు. గత ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి హయాంలోని వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎన్నింటినీ అమలు చేసినప్పటికీ 2024 సార్వత్రిక ఎన్నికల సమయానికి ఘోర పరాజయాన్ని చవి చూడక తప్పలేదు అన్నారు. అధికార దర్పంతో వ్యవహరిస్తున్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో ప్రజాగ్రహానికి గురై తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన జోస్యం చెప్పారు. ఇప్పటికైనా ప్రస్తుతం జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తే ప్రజల ఆదరాభిమానాలను చిరకాలం చూర గొంటారని హితవు పలికారు.విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బి. గోవిందు, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు వీరభద్ర స్వామి, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దేవేంద్ర, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు దాసరి శ్రీనివాసులు, ఈశ్వరయ్య, సిపిఐ నాయకులు భాష పాల్గొన్నారు.

నంద్యాల జిల్లాలో గణనీయంగా తగ్గిన నేరాలు!

గతేడాదితో పోలిస్తే 2026 జనవరి నుంచి అక్టోబర్ వరకు 1,081 కేసులు తగ్గుదల -- జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ ఐపీఎస్

నంద్యాల నవంబర్ 15 (మహాప్రభ)
నంద్యాల :నంద్యాల జిల్లా పోలీస్ శాఖ నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో చేపట్టిన చర్యలతో జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాన్ ఐపీఎస్ వెల్లడించారు. 2026 జనవరి నుంచి అక్టోబర్ వరకు జిల్లాలో నమోదైన నేరాలు, పోలీస్ శాఖ చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలకు సంబంధించిన వార్షిక నివేదిక వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం, నిరంతర నిఘా, విజిబుల్ పోలీసింగ్, రాత్రి, పగలు గస్తీ నిర్వహణతో నేరాల నియంత్రణలో పురోగతి సాధించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలకు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

నేరాల నమోదులో తగ్గుదల..
2025 సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 4,054 కేసులు నమోదు కాగా, 2026 జనవరి నుంచి అక్టోబర్ వరకు 2,973 కేసులు నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే 1,081 కేసులు తగ్గినట్లు నివేదిక వెల్లడిస్తోంది.

హత్యలు, ఘాత నేరాల్లో తగ్గుదల..
2025లో 47 హత్యలు, ఉద్దేశపూర్వకంగా కాని హత్యలకు సంబంధించిన కేసులు నమోదు కాగా, 2026లో ఇప్పటివరకు 42 కేసులు నమోదయ్యాయి. సాధారణ ఘాత నేరాలు 530 నుంచి 474కు తగ్గాయి. తీవ్ర ఘాత నేరాలు 13 నుంచి 12కు



తగ్గినట్లు ఎస్పీ వివరించారు.

చీటింగ్, ఆస్తి సంబంధిత నేరాలపై నియంత్రణ..
మోసాలకు సంబంధించిన కేసులు 2025లో 153 నమోదు కాగా, 2026లో 92కు తగ్గాయి. దోపిడీలు, బందిపోటు దొంగతనాలు, రాత్రి, పగటి దొంగతనాలకు సంబంధించిన ఆస్తి నేరాలు 100 నుంచి 82కు తగ్గాయి. పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడం ఈ తగ్గుదలకు దోహదపడినట్లు నివేదికలో పేర్కొన్నారు.

పోక్సో కేసుల తగ్గుదలకు అవగాహన కార్యక్రమాలు..
మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీస్ శాఖ చేపట్టిన అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఎస్పీ తెలిపారు. 2025లో 47 పోక్సో కేసులు నమోదు కాగా, 2026లో 35 కేసులు నమోదయ్యాయి. పాఠశాలలు, కళాశాలల్లో మహిళా పోలీసుల ద్వారా గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నేరాల పర్యవసానాలు, న్యాయస్థానాల్లో నిందితులకు పడే శిక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

స్థానిక చట్టాల ఉల్లంఘన కేసుల్లోనూ తగ్గుదల ..
స్పెషల్ అండ్ లోకల్ లాస్ (ప్రత్యేక, స్థానిక చట్టాలు) కింద 2025లో 613 కేసులు నమోదు కాగా, 2026లో 427 కేసులు నమోదయ్యాయి. కిడ్నాప్ కేసులు 9 నుంచి 8కు తగ్గాయి. రాబరీ కేసులు మాత్రం గతేడాది, ఈ ఏడాది రెండింటిలోనూ 9 చొప్పున నమోదయ్యాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు..
జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లు, ప్రమాదకర ప్రాంతాల్లో పోలీసుల పర్యవేక్షణ పెంచడంతో పాటు వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదాలు జరిగిన ప్రాంతాల్లో మళ్లీ అలాంటి ఘటనలు జరగకుండా రేడియం స్టిక్కర్లు కలిగిన బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు వంటి ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు.
2025లో రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 244 కాగా, 2026లో 221గా నమోదైంది. అయితే ప్రమాదాల్లో గాయపడిన వారి సంఖ్య కొంతమేర పెరిగినట్లు నివేదికలో వెల్లడించారు. ప్రమాదాల నివారణకు మరింత సమర్థవంతమైన చర్యలు, అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.
జిల్లాలో నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ సునీల్ షోరాన్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ చట్టాలను గౌరవించాలని ఆయన కోరారు.

తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

దేవరకొండ నవంబర్ 15 (మహాప్రభ)

కాంట్రాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఇరగ దిండ్ల కృష్ణ, తెలంగాణ ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం కోసం పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి నేటిపారుదల శాఖ ట్రైబల్ వెల్ఫేర్ సోషల్ వెల్ఫేర్ మున్సిపాలిటీ వివిధ డిపార్ట్మెంట్లలో పనులు చేసి రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటి వరకు ఒక పైసా కూడా బిల్లులు చెల్లించలేదు ఈ యొక్క బిల్లుల విషయంలో కాంట్రాక్టర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు గతంలో ఆరు నెలల క్రితం ఉపముఖ్యమంత్రి విక్రమార్క ని కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉత్తంకుమార్ రెడ్డి పొన్నం ప్రభాకర్ గౌడ్ మహేష్ కుమార్ గౌడ్ వీరందరిని చాలా సందర్భాలలో బిల్లులు రాణి కాంట్రాక్టర్లు అందరం వారికి మా యొక్క బాదసాధకాలు లెటర్స్ ఇచ్చాము మేము చేసిన పనులు వర్క్ ల పేర్లు క్లియర్ గా రాసి వినతిపత్రం అందజేశాము రెండు మూడు నెలల్లో క్లియర్ చేస్తామని మంత్రులు చెప్పారు పేమెంట్ చేయలేదు మేమందరం చిన్న కాంట్రాక్టర్లు మిత్తి లకు తెచ్చి పనులు పూర్తి చేసాము అయినా నేటి వరకు బిల్లులు చెల్లించలేదు మేము కాంట్రాక్టర్లను మా ఇంటి కోసం చేసుకోలేదు గవర్నమెంట్ ప్రజల



సౌకర్యార్థం కోసం రోడ్లు స్కూల్ బిల్డింగులు సిసి రోడ్లు హాస్టల్ మైనర్ రిపేర్ ఇవన్నీ పనులు పూర్తి చేసి కూడా రెండు సంవత్సరాలు కావస్తుంది ప్రభుత్వం మాత్రం మమ్మల్ని పట్టించుకునే మాధవడే కలువయ్యాడు వినతి పత్రాలు తీసుకోవడం చూద్దాం ఇస్తాము అంటున్నారే తప్ప ఒక పైస కూడా బిల్లులు చెల్లించడం లేదు ఇప్పటికే అటు మహబూబ్నగర్ జిల్లాలో నల్లగొండ జిల్లాలో హైదరాబాదులో వరంగల్లో హనుమకొండలో చాలామంది ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు జరిగావి ఈ విషయం కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాము ఆధారాలతో సహా అయినా మా పై కనికరం లేకుండా పోయింది బడా కాంట్రాక్టర్లకు బిల్లులు క్లియర్ చేస్తున్నారు చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు క్లియర్ గా చేయడం లేదు వాళ్లు పనులు చేశారు మేము పనులు చేసాము మాకెందుకు ఇవ్వరు మా పరిస్థితి ఏంటి మా కుటుంబ పరిస్థితి ఏంటి ఈ మధ్యలో జరగబోయే అసెంబ్లీ శీతాకాల సమావేశాలలో వెంటనే మా బిల్లులు చెల్లించాలని లేనియెడల బిల్లు రాని తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్టర్ అందరం అసెంబ్లీ ముందు ధర్నా కార్యక్రమం చేస్తాము చెల్లించేంతవరకు అక్కడనే నిరాహార దీక్ష చేస్తాం దయచేసి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మా బిల్లులు చెల్లించాలని లేనియెడల మాకు ఆత్మహత్య శరణమని తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోసియేషన్ కార్యదర్శి ఇరగ దిండ్ల కృష్ణ ప్రభుత్వాన్ని కి విజ్ఞప్తి చేస్తున్నాను

కొండాపూర్‌లో ఘనంగా కాపు, మున్నూరు కాపు, బలిజ వన భోజనాల మహోత్సవం.

శేరిలింగంపల్లి,(నవంబర్ 15) మహా ప్రభ

కొండాపూర్ కాపు, మున్నూరు కాపు, బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన భోజనాల మహోత్సవ కార్యక్రమం ఆదివారం 8వ పోలీస్ బెటాలియన్‌లోని బిక్షపతి ఫంక్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కాపు, మున్నూరు కాపు, బలిజ వర్గాలకు చెందిన కుటుంబ సభ్యులు, పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వన భోజనాల మహోత్సవానికి ముఖ్య అతిథిగా కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా హమీద్ పటేల్ మాట్లాడుతూ..వన భోజనాల కార్యక్రమాలు కేవలం కలసి భోజనం చేసే వేడుకలు మాత్రమే కాకుండా,సమాజంలోని ప్రజలందరినీ ఒకే వేదికపైకి



తీసుకువచ్చే ఆత్మీయ సమ్మేళనాలని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా కుటుంబాల మధ్య సత్సంబంధాలు మరింత బలపడటంతో పాటు, పెద్దలు, యువత, చిన్నారుల మధ్య అనుబంధం పెరుగుతుందని తెలిపారు.మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి సామాజిక కార్యక్రమాలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ,పరస్పర సహకారం,సోదరభావం, ఆత్మీయతను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ..వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న కాపు, మున్నూరు కాపు, బలిజ కుటుంబాల వారందరినీ ఒకచోట చేర్చి ఐకమత్యాన్ని చాటాలనే ఉద్దేశంతో ఈ వన భోజనాల మహోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకువచ్చిన మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పెద్దవంగరల్లో చేయూత పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధం!

-- నూతనంగా ఎంపికైన లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాల అందజేత

-- నవంబర్ 16న మండల కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం

పెద్దవంగర నవంబర్ 15 (మహాప్రభ)



రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలు, నూతనంగా ఎంపికైన లబ్ధిదారులు , దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న చేయూత పింఛన్ల పథకంలో భాగంగా పెద్దవంగర మండలంలో నూతనంగా ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నారు. ఈ నెల 16వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు పెద్దవంగర మండల కేంద్రంలోని శ రోడ్డు వద్ద ఉన్న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేయూత పెన్షన్ మంజూరీ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరుకానున్నారు. నూతనంగా పింఛన్లకు ఎంపికైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందజేయనున్నారు. కావున మండలంలోని నూతనంగా ఎంపికైన లబ్ధిదారులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కోరారు.

హార్వెస్టర్ కింద పడి రైతు మృతి

-పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు

గాంధారి నవంబర్ 15(మహాప్రభ)



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాంధారి మండలం పోతంగల్ కలాన్ గ్రామానికి చెందిన గొల్ల శ్రావణ్ తండ్రి గొల్లపల్లి మల్లేష్ శనివారం ఉదయం 10 గంటలకు సునాం గండి వద్ద గల తన చేనులో మొక్కజొన్న కోత కోసం హార్వెస్టర్ను(కోత మిషన్) తీసుకువచ్చారు. హార్వెస్టర్ నంబర్ టి.ఎస్. 18 హెచ్ 0248 డ్రైవర్ బంటి మొక్కజొన్న పట్టుతుండగా, నిర్లక్ష్యంగా నడిపి మల్లేష్ పైకి ఎక్కించడం వలన ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై గాంధారి ఎస్.ఐ. మహేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎటు చూసినా జనం.. అమ్మ వనంలో భక్తగణం

- ఏడుపాయల వన దుర్గమ్మ సన్నిధిలో పోటెత్తిన భక్తజనం

- అమ్మను దర్శించి తరించి తన్మయత్వం చెందిన భక్తులు

పాపన్నపేట నవంబర్15(మహాప్రభ)



ఎటు చూసినా జనమే జనం.. అందరిలో భక్తి భావం.. ఆధ్యాత్మిక వాతావరణం.. మంజీరా ఏడు పాయలుగా చీలి ప్రవహించే ప్రాంతం.. జననేజయుని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. దేశంలోనే రెండో వనదుర్గమాత ఆలయంగా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గమ్మ సన్నిధిలో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు వేకువ జామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. జిల్లా నలుమూల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, హైదరాబాద్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మంజీరాలో పుణ్య స్నానమాచరించి అమ్మ దర్శనానికి బారులు తీరారు. అమ్మ దర్శనంతో భక్తులు తన్మయత్వం చెందారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుల మధ్య బోనాలు, ఓడి బియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. వనదుర్గమ్మ.. దీవించమ్మ.. అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

చిన్నమనేనిపల్లి గ్రామస్తులతోముచ్చటిస్తున్న బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు రమేష్.

దేవరకొండ డివిజన్ నవంబర్ 15 (మహాప్రభ)



కొండమల్లేపల్లి మండలం చెన్ననేనిపల్లి గ్రామస్తులతో ముచ్చటించిన బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ . ఆదివారం.కొండమల్లెపల్లి మండలం చెన్నమనేని పల్లి గ్రామ పంచాయతీ యువకుల ఆహ్వానం మేరకుచెన్ననేనిపల్లిపర్యటించి గ్రామస్థులు సమస్యలను తెలుసుకుంటున్న బి.ఆర్.ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పెద్దిశెట్టి సత్యం, రామావత్ రమేష్ నాయక్, జాగ్రూ బావోజీ, కోటేష్, చింటూ నాయక్,శంకర్ , శ్రీ రాములు, వెంకటేష్, మల్లయ్య, మహా లక్ష్మయ్య, మణికం బాలయ్య, శ్రీనైయ వెంకటయ్య, సైదులు, కొండలు, గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ కొర్ర కిషన్ నాయక్ ఘనంగా సన్మానం



దేవరకొండ నవంబర్ 15 (మహాప్రభ)

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్టిఐ (ఆర్.టి ఐ)నల్లగొండ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన డాక్టర్ కొర్ర కిషన్ నాయక్ ను షాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ డాక్టర్ కొర్ర కిషన్ నాయక్ గత ఐదు సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాల్లోనూ బహుజన ఉద్యమాలను పేద ప్రజల కోసం పోరాట పటిమ కలిగిన వ్యక్తి అని ఐదు సంవత్సరాలుగా ఆర్టిఐ సంఘాన్ని స్థాపించి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉన్నటువంటి అవినీతి అక్రమాలను వెలికితీస్తూ ప్రజలను చైతన్యం చేసినటువంటి వ్యక్తి అని కొనియాడారు మన నియోజకవర్గం వ్యక్తి జిల్లా స్థాయిలో మానిటరింగ్ సభ్యులుగా ఎన్నిక కావడం హర్షణీయమని అన్నారు మీరు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ చాలా విషయాల్లో సమస్యలు పరిష్కరిస్తూ ముందు ముందు మరొన్నో పదవులు పొందాలని ఆశిస్తున్నాను ఈ కార్యక్రమంలో పున్న వెంకటేష్ నేత, అప్పం వీరయ్య ,డాక్టర్ బాషా నాయక్ ,గడిగ విజయభాస్కర్, చెరుకు నాగరాజు, బుషరాజు నిరంజన్, కొమ్ము శైలేందర్ ,సైదులు ,లైబ్రరీయన్ శారద తదితరులు పాల్గొన్నారు

మైపతి అరుణ్ కుమార్ బంజారా జాతి మొత్తానికి క్షమాపణ చెప్పాలి

-జనసేన పార్టీ సీనియర్ నాయకులు సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోర్ర చందు నాయక్

దేవరకొండ నవంబర్ 15 (మహాప్రభ)



చందు నాయక్ విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేస్తూ జనసేన పార్టీ సీనియర్ నాయకులు సేవలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొర్ర చందు నాయక్ మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర ప్రభుత్వం మైపతి అరుణ్ కుమార్ పై చట్టరీత్య చర్యలు తీసుకోవడంలో విఫలమైంది యావత్ భారత దేశ గిరిజన లంబాడి బిడ్డలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డీజీపీ కార్యాలయం ముట్టడిస్తు ఉద్యమాలు చేపడతామని చందు నాయక్ అన్నారు బంజారా జాతి ఆరాధ్య దైవం, సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గురించి మతి లేని మైపతి అరుణ్ కుమార్ కోట్లాది మంది బంజారాల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సేవాలాల్ మహారాజ్ను కించపరిచే విధంగా మాట్లాడటం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం మైపతి అరుణ్ కుమార్ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు సేవాలాల్ మహారాజ్ గురించి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, బంజారా జాతి మొత్తానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని కోర్ర చందు నాయక్ డిమాండ్ చేశారు. తక్షణమే క్షమాపణ చెప్పని పక్షంలో సేవలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, మైపతి అరుణ్ కుమార్ ను ఎక్కడికి వెళ్లినా అడ్డుకుంటామని తీవ్రంగా హెచ్చరించారు. నోరు అదుపు లేకుండా మాట్లాడడం సరికాదు అరుణ్ కుమార్ బంజారాల ఆత్మగౌరవంపై దాడి జరిగితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, ఈ విషయంలో ప్రభుత్వం కూడా తక్షణమే స్పందించి అరుణ్ కుమార్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోర్ర చందు నాయక్ అన్నారు

రామాయంపేట పరిధిలో రోడ్డు ప్రమాదం

-- ఇద్దరు యువకులకు గాయాలు

-రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామ శివారులో గల భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో బైక్ అదుపుతప్పి స్కిడ్ అయింది.

-ఈ ప్రమాదంలో బైక్ పై వెళ్తున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి.

రామాయంపేట నవంబర్ 15 మహాప్రభ



ఒకరికి తలకు తీవ్ర గాయం కావడంతో స్థానిక గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్ అజయ్ కుమార్ నేతృత్వంలో వైద్య సిబ్బంది వారికి ప్రాథమిక చికిత్స అందించారు. తలకు గాయమైన యువకుడికి మెరుగైన వైద్యం కోసం మెదక్ ఆసుపత్రికి స్కానింగ్ నిమిత్తం పంపించారు.ఇద్దరు బైక్ పై వస్తున్న వ్యక్తులు మెదక్ నుండి ఆర్మూర్ వైపు వస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనజాతీయ గౌరవ దివస్ వేడుకల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాము

పెద్దవంగర నవంబర్ 15 (మహాప్రభ)



భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో నిర్వహించిన జనజాతీయ గౌరవ దివస్ వేడుకల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్‌ను బీజేపీ నాయకులతో కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, పల్లె కుమార్, గట్టు రాంబాబు, గుగులోత్ భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

-పురోహితులు పురుషోత్తమ శర్మ, రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్త పూజలు



శివ్వంపేట, నవంబర్15(మహాప్రభ):
మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలోని సుమారు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ కోదండరామ స్వామి పురాతన దేవాలయంలో గ్రామ పురోహితులు శాస్త్రుల పురుషోత్తమ శర్మ, రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ శాస్త్ర పండితులు కీ.శే. శాస్త్రుల అనంతరామశర్మ, కీ.శే. శాస్త్రుల విశ్వనాథ శాస్త్రి దివ్యాశీస్సులతో వేదోక్త సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. .కీ.శే. పబ్బ అంజయ్య, రామవ్వ జ్ఞాపకార్థం పబ్బ రమేష్ గుప్తా, స్వరూపారాణి, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ ఇసుగారి మల్లేష్, పురోహితులు దేవదత్త శర్మ, చంద్రశేఖర శర్మ, కుమార శర్మ, బ్రహ్మశ్రీ గంగవరం నారాయణ శర్మ, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్లు, కుట్టు మిషన్ల పంపిణీ

-లింగంపేటలో మూడు మండలాల లబ్ధిదారులకు పింఛన్లు..

-ఎల్లారెడ్డిలో ఎనిమిది మండలాల అర్హులైన లబ్ధిదారులకు కుట్టు మిషన్లు

ఎల్లారెడ్డి, నవంబర్ 16, (మహాప్రభ):
ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సోమవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆధ్వర్యంలో రెండు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నూతన పింఛన్ల పంపిణీతో పాటు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12:30 గంటలకు లింగంపేట పట్టణంలోని జీఎన్ఆర్ గార్డెన్స్‌లో లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన నూతన పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.అదేవిధంగా సాయంత్రం 4:30 గంటలకు ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన ఎంపికైన లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేయనున్నారు. ఈ కార్యక్రమం అన్ని వర్గాల లబ్ధిదారుల కోసం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



టీ వై జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డా. తనుగుల జితేందర్ రావును కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



పాపన్నపేట నవంబర్15(మహాప్రభ)
టీ వై జె ఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ చారి కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ టివైజేఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. జితేందర్ రావు ను రాష్ట్ర జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ చారి కుమార్తె వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని రాష్ట్ర అధ్యక్షులు డా. తనుగుల జితేందర్ రావును ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టివైజేఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, రాష్ట్ర కార్యదర్శి జగత్ కృష్ణ, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సంతోష్ కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో శ్రీ స్వామిఅమ్మవార్లకు వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, -15నవంబర్ (మహాప్రభ).
లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు పల్లకీ ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం సర్కారీ సేవగా ప్రతి ఆదివారం, పౌర్ణమి, మూలా నక్షత్రం రోజుల్లో ఈ పల్లకీ ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ వస్తోంది. ఈ ఉత్సవంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయంలోని ఆశీర్వచన మండపంలో అర్చకస్వాములు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సేవా సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ నిర్వహించారు.తదుపరి శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేయించి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించారు. భక్తిభావంతో సాగిన ఈ పల్లకీ ఉత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది.

35 రోజుల పోరాటానికి ఫలితం..





-పాలిటెక్నిక్‌ల విలీన ప్రతిపాదనకు బ్రేక్

-స్కిల్స్ వర్సిటీలోకి ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల తరలింపునకు స్వస్తి

-ఉన్నత విద్యాశాఖ పరిధిలోనే కొనసాగిస్తూ జీవో 157 జారీ

-ఎరవెల్లి జగన్ సారథ్యంలో ఫలించిన విద్యార్థి జేఏసీ అలుపెరగని ఉద్యమం

-ఉద్యమానికి మరింత బలాన్నిచ్చిన అధ్యాపకుల సహాయ నిరాకరణ

-హైపవర్ కమిటీ సిఫార్సులతో పాత జీవో 97కు సవరణలు

-విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్‌కు వెల్లువెత్తుతున్న అభినందనలు

హైదరాబాద్, నవంబర్ 15,(మహాప్రభ)
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల భవిష్యత్తుపై గత కొంతకాలంగా నెలకొన్న తీవ్ర అనిశ్చితికి తెరదించుతూ తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ లో విలీనం చేయకుండా, ఉన్నత విద్యాశాఖ పరిపాలనా నియంత్రణలోనే కొనసాగిస్తూ నవంబరు 13న జీవో ఎం.ఎస్. నం. 157ను విడుదల చేసింది. గతంలో పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్స్ యూనివర్సిటీతో అనుసంధానిస్తూ తీసుకున్న నిర్ణయంపై విద్యార్థులు, అధ్యాపకుల్లో తీవ్ర ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కీలక పరిణామం వెనుక తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర చైర్మన్, జేఎన్‌టీయూహెచ్ డీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎరవెల్లి జగన్ నేతృత్వంలో సాగిన 35 రోజుల అలుపెరగని ఉద్యమం ప్రధాన పాత్ర పోషించింది.

ఎరవెల్లి జగన్ నాయకత్వంలో 35 రోజుల సమరశీల పోరాటం..
పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థలో మార్పుల పేరుతో ప్రభుత్వం గతంలో తీసుకున్న నిర్ణయాలపై మొదటి నుంచీ విద్యార్థి వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల పరిపాలన, విద్యా ప్రమాణాలు, పరీక్షల నిర్వహణ, సాంకేతిక విద్యామండలి భవిష్యత్తు, అధ్యాపకుల సర్వీసు అంశాలపై అనేక సందేహాలు తలెత్తాయి. ఈ తరుణంలో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు భంగం కలగకుండా చూడాలనే సంకల్పంతో ఎరవెల్లి జగన్ ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీని సమన్వయం చేస్తూ వరుసగా 35 రోజులపాటు సమరశీల పోరాటాన్ని ముందుండి నడిపించారు. విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. సన్నాహక సమావేశాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాల సమర్పణ వంటి వివిధ రూపాల్లో ఆందోళనలను ఉద్ధృతం చేసి పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లారు.

అధ్యాపకుల సహాయ నిరాకరణతో ఉద్యమానికి మరింత బలం..
ఎరవెల్లి జగన్ సారథ్యంలో విద్యార్థి జేఏసీ చేపట్టిన ఈ ఉద్యమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ అధ్యాపకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. అధ్యాపకులు సైతం సహాయ నిరాకరణకు దిగడంతో ఉద్యమం మరింత విస్తృతరూపం దాల్చింది. విద్యార్థుల ఆందోళనలకు అధ్యాపకుల మద్దతు తోడవడంతో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ పరిరక్షణ అంశం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. వివిధ వర్గాలను సమన్వయం చేస్తూ ఎరవెల్లి జగన్ నిరంతరంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో.. విద్యార్థుల విద్యా ప్రయోజనాలు, అధ్యాపకుల హక్కులపై ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హైపవర్ కమిటీ సిఫార్సులు.. జీవో 157 విడుదల
పాలిటెక్నిక్ విద్య ఆధునికీకరణ, విద్యార్థుల విద్యా, ఉద్యోగ ప్రయోజనాల పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వం 2026 ఆగస్టు 24న జీవో ఆర్టీ నం. 1239 ద్వారా ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చేసిన సిఫార్సులను పరిశీలించిన అనంతరం, గతంలో జారీ చేసిన జీవో ఎం.ఎస్. నం. 97కు సవరణలు చేస్తూ తాజాగా జీవో ఎం.ఎస్. నం. 157ను విడుదల చేసింది. ఈ తాజా ఉత్తర్వుల ప్రకారం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు విద్యాశాఖలోని ఉన్నత విద్యా విభాగం పరిపాలనా నియంత్రణలో కొనసాగుతాయి. ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు మాత్రం శక్తి శాఖ పరిధిలోనే కొనసాగుతాయి. వాటి పార్యవేక్షణాళిక నియంత్రణ బాధ్యతలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అప్పగించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తన విద్యా కార్యక్రమాలను విస్తరించేందుకు ఏఐసీటీఈ, ఇతర సంబంధిత సంస్థల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

జగన్ పోరాటానికి దక్కిన గుర్తింపు.. వెల్లువెత్తుతున్న అభినందనలు
పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రత్యక్ష పరిపాలనా పరిధిలోకి తీసుకెళ్లకుండా ఉన్నత విద్యాశాఖ పరిధిలోనే ఉంచడం 35 రోజుల ఉద్యమానికి దక్కిన చారిత్రక విజయమని జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేవలం నిరసనలకే పరిమితం కాకుండా, సమస్యలపై నిరంతరం ప్రభుత్వానికి వాస్తవాలను వివరించడం, విద్యార్థుల ఆందోళనలను ఒక సంఘటిత ఉద్యమంగా మలచడంలో ఎరవెల్లి జగన్ ప్రదర్శించిన నాయకత్వ పటిమను విద్యార్థి సంఘాల ప్రతినిధులు కొనియాడుతున్నారు.
విద్యా వ్యవస్థలో మార్పులు చేపట్టే సమయంలో విద్యార్థులు, అధ్యాపకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఉద్యమం మరోసారి చాటిచెప్పిందని జేఏసీ వర్గాలు పేర్కొన్నాయి. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ భవిష్యత్తు కోసం 35 రోజుల పాటు అలుపెరగని పోరాటం సాగించి విజయం సాధించిన ఎరవెల్లి జగన్‌కు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, అధ్యాపకులు, జేఏసీ నాయకుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

సంక్షేమం, అభివృద్ధి రెండు కల్లులా భావించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.





-అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పెన్షన్లు.

-మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట.

-రాష్ట్రవ్యాప్తంగా 4లక్షల 50,000 మందికి పింఛన్లు మంజూరు చేసాం.

-మెదక్ జిల్లాలో 11వేల మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయి.

మెదక్ జిల్లా -15నవంబర్ (మహాప్రభ).
ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర అర్హులైన వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన చేయూత పింఛన్ల కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహఅన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నామని అయన స్పష్టం చేశారు..మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ ల మంజూరు ఉత్తర్వులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల నూతన పింఛన్లు మంజూరు చేయగా, ఒక్క మెదక్ జిల్లాలోనే 11 వేల పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు కలిపి 1,400 పింఛన్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు.
మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సంఘాలకు పెద్దఎత్తున ప్రోత్సాహం అందిస్తోందన్నారు. బ్యాంకు లింకేజీ లేకుండానే లక్షల రూపాయల రుణాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, డ్రోన్ల నిర్వహణ వంటి రంగాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు.రాష్ట్రంలో గుడిసెలు లేని సమాజాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఏటా 3,800 ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు 1,400 ఇళ్లు కేటాయించగా, ఇప్పటివరకు 400 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని, ఇళ్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్, అందోల్, బొడ్మాట్ పల్లి వంటి వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానిక నిరుద్యోగ యువతకు, నైపుణ్యం కలిగిన యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.కొత్తగా మంజూరైన పింఛన్లలో రేగోడు అల్లాదుర్గ్, టేక్మాల్ మండలాల్లో వితంతువులు,965 ఒంటరి మహిళలు166 , దివ్యాంగులు 195 గీత కార్మికులు 60 మంది ఉన్నారని తెలిపారు .కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎందరో మహిళలకు పింఛన్ ఆత్మగౌరవంతో జీవించే భరోసానిచ్చింది. అని వివరించారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, మెదక్ ఇంచార్జ్ ఆర్టీవో రామకృష్ణ, టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల విష్ణువర్ధన్ రెడ్డి, అల్లాదుర్గ్, రేగోడు, టేక్మాల్ మండలాల ఎంపీడీవోలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

భారీగా తగ్గనున్న బంగారం ధరలు!

- 2027 డిసెంబర్ నాటికి ఔన్స్ ధర 4,650 డాలర్లకు చేరే అంచనా
- 10 గ్రాముల పసిడి ధర రూ.1.20 లక్షలకు దిగొచ్చే అవకాశం
- అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు ప్రభావం
- బంగారంపై తగ్గనున్న పెట్టుబడిదారుల ఆసక్తి
- ప్రభుత్వ బాండ్ల వైపు మళ్లనున్న మదుపరులు
- ధరల తగ్గుదలపై అంచనా వేసిన గోల్డ్‌మన్ సాచ్స్
- అంతర్జాతీయ పరిణామాలతో మారనున్న పసిడి మార్కెట్
- ఇప్పటికిప్పుడు నిర్ధారించలేమంటున్న విశ్లేషకులు



న్యూఢిల్లీ

పసిడి కొనుగోలుదారులకు ఊరటనిచ్చే అంచనాలు వెలువడ్డాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ విశ్లేషించింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచవచ్చన్న అంచనాలు పసిడి ధరలపై ప్రభావం చూపనున్నాయని పేర్కొంది. వడ్డీ రేట్లు పెరిగితే బంగారంపై పెట్టుబడుల ఆకర్షణ తగ్గి, మదుపరులు ప్రభుత్వ బాండ్ల వైపు మళ్లే అవకాశముందని తెలిపింది. అమెరికా కేంద్ర బ్యాంకు వడ్డీ రేట్లను పెంచినప్పుడు ప్రభుత్వ బాండ్లపై వచ్చే ప్రతిఫలం ఆకర్షణీయంగా మారుతుంది. మరోవైపు బంగారంపై పెట్టుబడులకు వడ్డీ రూపంలో ఎలాంటి ఆదాయం లభించదు. దీంతో పెట్టుబడిదారులు బంగారం నుంచి తమ పెట్టుబడులను ఇతర సాధనాలకు మళ్లించే అవకాశం ఉంటుంది. ఫలితంగా పసిడికి డిమాండ్ తగ్గి అంతర్జాతీయ మార్కెట్లో ధరలు దిగివచ్చే పరిస్థితులు ఏర్పడవచ్చని ఆర్థిక విశ్లేషణలు సూచిస్తున్నాయి. గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా ప్రకారం 2027 డిసెంబర్ నాటికి ఔన్స్ బంగారం ధర 4,650 డాలర్లకు చేరవచ్చు. ఈ పరిణామం దేశీయ మార్కెట్‌పైనా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు తగ్గితే భారత్‌లోనూ పసిడి ధరలు దిగివచ్చే అవకాశముంది. ఈ నేపథ్యంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1.20 లక్షల స్థాయికి తగ్గవచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. అయితే దేశీయంగా బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌తో పాటు రూపాయి మారకం విలువ, దిగుమతి సుంకాలు, పన్నులు, స్థానికంగా కొనుగోళ్ల డిమాండ్ వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తీసుకునే నిర్ణయాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు కూడా పసిడి ధరల గమనాన్ని ప్రభావితం చేస్తాయి. గోల్డ్‌మన్ సాచ్స్ వెల్లడించినవి భవిష్యత్ అంచనాలు మాత్రమేనని, ధరలు తప్పనిసరిగా అదే స్థాయికి చేరుతాయని భావించరాదని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి.

బిజినెస్

భారత మార్కెట్లోకి డెంజా
డీ9 లగ్జరీ ఎలక్ట్రిక్ కారు

-రూ.90 లక్షల ఎక్స్‌షోరూమ్ ధరతో ప్రీమియం ఎంపీవీ ఆవిష్కరణ
-ఒక్కసారి ఛార్జింగ్‌తో 730 కిలోమీటర్ల ప్రయాణ పరిధి
-115 కిలోవాట్ల బ్యాటరీతో శక్తివంతమైన విద్యుత్ వ్యవస్థ
-మసాజ్ సదుపాయంతో ప్రత్యేక కెప్టెన్ సీట్లు



న్యూఢిల్లీ:

భారత ఎలక్ట్రిక్ వాహన మార్కెట్లోకి మరో లగ్జరీ కారు ప్రవేశించింది. డెంజా సంస్థ తన ప్రీమియం ఎంపీవీ డీ9ను దేశీయ మార్కెట్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. అధునాతన సాంకేతికత, విలాసవంతమైన ప్రయాణ సదుపాయాలు, ఎక్కువ ప్రయాణ పరిధిని లక్ష్యంగా రూపొందించిన ఈ కారును రూ.90 లక్షల ఎక్స్‌షోరూమ్ ధరతో విక్రయించనుంది. ఒక్కసారి పూర్తిగా ఛార్జింగ్ చేస్తే 730 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని కంపెనీ ప్రకటించింది. డీ9లో 115 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన బ్యాటరీని ఏర్పాటు చేశారు. సుదూర ప్రయాణాలకు అనుకూలంగా ఉండేలా దీని ప్రయాణ పరిధిని రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది. లగ్జరీ వాహనాలను కోరుకునే వారితో పాటు విద్యుత్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్న వినియోగదారులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ కారును తీసుకొచ్చింది. ప్రయాణికుల సౌకర్యానికి ఇందులో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. మసాజ్ సదుపాయం కలిగిన కెప్టెన్ సీట్లు ఏర్పాటు చేశారు. దీర్ఘ ప్రయాణాల్లో అలసట తగ్గించేలా ఈ సీట్లను రూపొందించారు. వినోదం కోసం 16 స్పీకర్లతో కూడిన అత్యాధునిక ధ్వని వ్యవస్థను అందించారు. విలాసవంతమైన అంతర్గత అలంకరణతో పాటు ప్రయాణ అనుభూతిని మెరుగుపరిచే సదుపాయాలు ఈ కారులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో డీ9 బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోనూ ఎంపిక చేసిన డీలర్‌షిప్‌ల ద్వారా ముందస్తు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. బుకింగ్ కోసం రూ.10 లక్షల టోకెన్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని సంస్థ తెలిపింది. లగ్జరీ ఎంపీవీ విభాగంలో ఇప్పటికే ఉన్న వాహనాలకు డెంజా డీ9 పోటీ ఇవ్వనుంది. ధర, ప్రయాణ పరిధి, విలాసవంతమైన సదుపాయాల ఆధారంగా ఈ కారు భారత మార్కెట్లో వినియోగదారులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

బీఎస్ఎన్ఎల్ అదిరిపోయే ఆఫర్.. రూ.51కే!

- కొత్త వినియోగదారులకు ఉచితంగా సిమ్ కార్డు
- కేవలం రూ.51తో 28 రోజుల సేవలు
- రోజుకు 2 జీబీ చొప్పున అంతర్జాల వినియోగం
- అపరిమిత ఉచిత కాలింగ్ సదుపాయం
- రోజుకు 100 సందేశాలు పంపుకునే వెసులుబాటు
- ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే ఆఫర్
- ఇతర సంస్థల నుంచి మారేవారికి ప్రత్యేక అవకాశం
- కొత్త వినియోగదారులను ఆకర్షించడమే లక్ష్యం



న్యూఢిల్లీ:

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కొత్త వినియోగదారుల కోసం ఆకర్షణీయమైన ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తక్కువ ధరలో ఎక్కువ ప్రయోజనాలు పొందాలనుకునే వారికి ఈ అవకాశం ఉపయోగపడనుంది. ఈ ఆఫర్‌లో భాగంగా కొత్త వినియోగదారులకు ఉచితంగా సిమ్ కార్డును అందించడంతో పాటు, కేవలం రూ.51 రీఛార్జ్‌తో 28 రోజుల పాటు ప్రత్యేక సేవలను పొందే వెసులుబాటు కల్పిస్తోంది. ఈ పథకం కింద రోజుకు 2 జీబీ డేటా, అపరిమిత కాలింగ్ సదుపాయం, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు లభించనున్నాయి. తక్కువ ఖర్చుతో కాలింగ్, అంతర్జాల సేవలను వినియోగించుకోవాలనుకునే వారికి ఈ ఆఫర్ ప్రయోజనకరంగా ఉంటుందని సంస్థ భావిస్తోంది. ముఖ్యంగా ప్రైవేట్ టెలికాం సంస్థల అధిక ధరల రీఛార్జ్‌లతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులను ఆకర్షించేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. ఇతర టెలికాం నెట్‌వర్క్‌లను వినియోగిస్తున్న వారు బీఎస్ఎన్ఎల్‌కు మారాలనుకుంటే ఈ ఆఫర్‌ను ఉపయోగించుకోవచ్చని సంస్థ పేర్కొంది. ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే ఈ అవకాశం అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. అయితే ఆఫర్‌కు సంబంధించిన అర్హతలు, అమలు ప్రాంతాలు, ఇతర నిబంధనలను సిమ్ తీసుకునే ముందు బీఎస్ఎన్ఎల్ అధికారిక కేంద్రంలో నిర్ధారించుకోవడం మంచిది.

మైదానంలోనే యుద్ధం..
బయట స్నేహంగా ఉంటాం: శ్రేయస్ అయ్యర్

న్యూజిలాండ్ పర్యటనలో పరిమిత ఓవర్ల సిరీస్‌లు గెలవడంపై శ్రేయస్ హర్షం
మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో బౌలర్లు అత్యుత్తమంగా రాణించారని వెల్లడి
జట్టులో మార్పులు చేర్పులు ఉన్నా ఎలాంటి సాకులు వెతకలేదన్న కెప్టెన్
మైదానంలో తీవ్ర పోటీ ఉన్నా వెలుపల ఇరు జట్ల మధ్య చక్కని స్నేహం
మ్యాచ్‌లకు భారీగా హాజరై ప్రోత్సహించిన అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు



న్యూజిలాండ్ పర్యటనలో టీ20, వన్డే సిరీస్‌లను కైవసం చేసుకోవడం జట్టుకు దక్కిన గొప్ప ఘనత అని టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నాడు. నిరంతరం మారుతున్న వాతావరణం, విభిన్నమైన పిచ్ పరిస్థితులు అనేక సవాళ్లు విసిరినప్పటికీ, వాటన్నింటినీ అధిగమించి రెండు సిరీస్‌లలోనూ విజేతగా నిలవడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న భారత జట్టు ఇప్పటికే టీ20 సిరీస్ గెలుచుకోగా, నేడు జరిగిన చివరి వన్డేలోనూ గెలిచి 3-1తో వన్డే సిరీస్ ను కూడా చేజిక్కించుకుంది. ఇవాళ్టి మ్యాచ్ ముగిసిన అనంతరం శ్రేయస్ అయ్యర్ జట్టు ప్రదర్శన, వ్యూహాలపై మాట్లాడాడు. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోయినా, మ్యాచ్‌ను ఏ క్షణంలోనైనా మనవైపు తిప్పుకోగలమనే గట్టి నమ్మకం తమలో ఉందని శ్రేయస్ చెప్పాడు. జట్టులోని ప్రతి ఆటగాడూ ఇదే సానుకూల దృక్పథంతో ఆలోచించారని, మైదానంలో ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయగలిగామని వివరించాడు. ఈ సిరీస్ పూర్తిగా బ్యాటర్లకు అనుకూలించింది కాదని, ఇరు జట్లలోని బౌలర్లదే కీలక పాత్ర అని అన్నాడు. ముఖ్యంగా భారత బౌలర్లు తీవ్ర ఒత్తిడిని తట్టుకుని, పరిస్థితులకు అనుగుణంగా బౌలింగ్ చేసి జట్టుకు విజయాలు అందించారని కొనియాడాడు. ఆటగాళ్లలో కనిపించిన ఆత్మవిశ్వాసం, పోరాట తత్వమే జట్టును ముందుకు నడిపించాయని ప్రశంసించాడు. టెస్టు మ్యాచ్‌ల సన్నాహకాలు, ఆటగాళ్ల గాయాల కారణంగా తుది జట్టులో తరచూ మార్పులు చేయాల్సి వచ్చిందని శ్రేయస్ అయ్యర్ గుర్తుచేశాడు. జట్టులో మార్పులు చేర్పులు జరిగినప్పుడు పరిస్థితులకు అలవాటు పడటం ఆటగాళ్లకు కాస్త కష్టమైన విషయమేనని అంగీకరించాడు. అయితే, తాము ఏ దశలోనూ ఎలాంటి సాకులు చెప్పాలనుకోలేదని స్పష్టం చేశాడు. తమపై ఉన్న అంచనాలకు తగ్గట్టుగా ఆడాలని, మైదానంలోకి దిగిన ప్రతి ఒక్కరూ తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతోనే ముందుకు సాగామని పేర్కొన్నాడు. ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు స్టేడియాలకు భారీగా తరలివచ్చిన భారత, న్యూజిలాండ్ అభిమానులకు శ్రేయస్ అయ్యర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపాడు. ఫలితాలతో సంబంధం లేకుండా ఇరు జట్లను సమానంగా ప్రోత్సహించడం క్రీడాస్ఫూర్తికి నిదర్శనమని, ఇది చూడ్డానికి ఎంతో ముచ్చటగా ఉందని అన్నాడు. అభిమానుల నుంచి లభించే ఇలాంటి మద్దతే ఆటగాళ్లకు అసలైన స్ఫూర్తి అని పేర్కొన్నాడు. మైదానంలో దిగితే ఇరు జట్ల మధ్య తీవ్ర పోటీ ఉంటుందని, అది ఒక యుద్ధంలాంటి పోరాటమని చెబుతూనే.. మైదానం వెలుపల ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య చక్కని స్నేహం ఉంటుందని, క్రీడల్లో ఎప్పుడూ ఇలాంటి వాతావరణమే ఉండాలని శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశాడు.

స్పోర్ట్స్

గ్రౌండ్‌లో సూర్యకుమార్ విధ్వంసక బ్యాటింగ్..

- ఆపై మటన్ కర్రీ, రోటీలతో దావత్!
-తుపాను ఇన్నింగ్స్ తర్వాత నేలపై కూర్చొని మటన్ తిన్న సూర్యకుమార్
-సూర్యకుమార్, సర్ఫరాజ్ ఖాన్ మటన్ విందు వీడియో వైరల్
-హైదరాబాద్‌పై కేవలం 21 బంతుల్లోనే 60 పరుగులు బాదిన ముంబై కెప్టెన్
-15 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న స్టార్ బ్యాటర్
-టీమిండియాలోకి త్వరలోనే రీఎంట్రీ ఇస్తానంటూ సూర్య ధీమా



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తుపాను ఇన్నింగ్స్ ఆడిన అనంతరం స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ ఓ స్నేహితుడి ఇంట నేలపై కూర్చొని మటన్ విందు ఆస్వాదించిన వైనం సోషల్ మీడియాలో విపరీతంగా ఆకట్టుకుంటోంది. కోల్‌కతా వేదికగా హైదరాబాద్‌పై ముంబై విజయం సాధించిన తర్వాత, సహచర ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్‌తో కలిసి సూర్య వేడివేడి రొట్టెలు, ఘుమఘుమలాడే మటన్ కర్రీ, రోటీలు తింటూ కనిపించాడు. మైదానంలో పరుగుల విధ్వంసం సృష్టించే ఈ స్టార్ ఆటగాళ్లు, గదిలో కింద కూర్చొని ఎంతో నిరాడంబరంగా భోజనం చేయడం అభిమానులను అమితంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భోజనం అద్భుతంగా ఉందని, మాట్లాడటం కంటే తినడానికే మనసవుతోందని సర్ఫరాజ్ సరదాగా చెప్పిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో ముంబై సారథి సూర్యకుమార్ యాదవ్ బ్యాట్‌తో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. హైదరాబాద్ నిర్దేశించిన 172 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేవలం 21 బంతుల్లోనే 285.71 స్ట్రైక్ రేట్‌తో అజేయంగా 60 పరుగులు సాధించాడు. ఇందులో భాగంగా కేవలం 15 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం బాది ఔరా అనిపించాడు. సూర్య మెరుపులతో ముంబై జట్టు కేవలం 13.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టు ఎంపికలో చోటు దక్కకపోవడం తనను బాధించిందని సూర్య ఈ సందర్భంగా పేర్కొన్నాడు. తాను మళ్లీ టీమిండియాలో ఆడాలంటే తన ఆటతీరుతో మరోసారి తలుపులు బద్దలు కొట్టాల్సిందేనని స్పష్టం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో ఆకలి, ఆటపై పట్టు ఇంకా తగ్గలేదని సూర్య ఈ విధ్వంసకర ఇన్నింగ్స్ ద్వారా తేల్చిచెప్పాడు.

ఒక్క మ్యాచ్ ఓడినా మళ్లీ కోహ్లీనే కెప్టెన్‌ను చేయాలంటారు: డుప్లెసిస్

-విరాట్ కోహ్లీ మద్దతు వల్లే బాధ్యతలు సమర్థంగా చేపట్టానన్న మాజీ సారథి
-కోహ్లీ అండ లేకపోతే తాను పూర్తిగా విఫలమయ్యేవాడినని వ్యాఖ్య
-మ్యాచ్ ఓడిపోతే కోహ్లీనే మళ్లీ కెప్టెన్ చేయాలనే డిమాండ్ వస్తుందన్న డుప్లెసిస్
-కోహ్లీతో ఏర్పడిన స్నేహం ఎంతో ప్రత్యేకమైనదని వెల్లడి



ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుకు నాయకత్వం వహించడం, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో ఉన్న అనుబంధంపై దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఫాఫ్ డుప్లెసిస్ ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. విరాట్ కోహ్లీ నుంచి పూర్తి స్థాయి మద్దతు లభించడం వల్లే తాను ఆర్సీబీ సారథ్య బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించగలిగానని, అతడి అండ లేకపోతే తాను కెప్టెన్‌గా పూర్తిగా విఫలమయ్యేవాడినని స్పష్టం చేశాడు. క్రిక్‌ఇన్‌ఫో నిర్వహించిన 'క్రికెటర్స్ ఆన్ క్రికెటర్స్' కార్యక్రమంలో సహచర మాజీ ఆటగాడు డేల్ స్టెయిన్‌తో మాట్లాడుతూ డుప్లెసిస్ ఈ వివరాలను వెల్లడించాడు. 2021 సీజన్ ముగిసిన తర్వాత తనపై పనిభారాన్ని తగ్గించుకోవడానికి, బ్యాటింగ్‌పై మరింత దృష్టి పెట్టడానికి విరాట్ కోహ్లీ ఆర్సీబీ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడం తెలిసిందే. ఆ తర్వాత 2022 వేలంలో ఆర్సీబీ ఫ్రాంచైజీ డుప్లెసిస్‌ను కొనుగోలు చేసి వెంటనే జట్టు పగ్గాలు అప్పగించింది. ఆ సమయంలో ఆర్సీబీ క్రికెట్ డైరెక్టర్‌గా ఉన్న మైక్ హెసన్.. జట్టుకు నాయకత్వం వహిస్తావా అని తనను అడిగాడని డుప్లెసిస్ గుర్తు చేసుకున్నాడు. మొదట కాస్త సందిగ్ధత ఉన్నప్పటికీ, విరాట్ కోహ్లీ నుంచి వచ్చిన ఒక మెసేజ్ ఆ సందేహాలన్నింటినీ పటాపంచలు చేసిందని డుప్లెసిస్ చెప్పాడు.



చిరంజీవి 'కాకా'లో స్పెషల్ సాంగ్..

- రితికా సింగ్‌తో మాస్ స్టెప్పులు, షూటింగ్ కూడా పూర్తి!



మెగాస్టార్ చిరంజీవి వరుస సినిమాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న క్రేజీ ప్రాజెక్టుల్లో 'కాకా' ఒకటి. దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతోంది. సినిమాలో ఓ ప్రత్యేక పాట కోసం ప్రముఖ హీరోయిన్ రితికా సింగ్‌ను ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' మంచి విజయాన్ని అందుకుంది. దీంతో వీరిద్దరి కలయికలో వస్తున్న 'కాకా' సినిమాపై అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది.ఇక ఈ చిత్రంలో చిరంజీవి విభిన్నమైన ఛాయలున్న పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే యాక్షన్ కథాంశంతో ఈ సినిమాను భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా తమన్ సినిమా ప్రమోషన్లకు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. డిసెంబర్ 1 నుంచి ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన ప్రత్యేక కంటెంట్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో మెగాస్టార్ అభిమానుల్లో సినిమా ప్రమోషన్లపై ఆసక్తి పెరిగింది. ఇక తాజాగా వినిపిస్తున్న వార్త ప్రకారం ఈ సినిమాలో ఓ ప్రత్యేక డ్యాన్స్ నంబర్ ఉండబోతోందట. ఈ పాటలో హీరోయిన్ రితికా సింగ్ కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాదు, ఇప్పటికే ఈ పాటకు సంబంధించిన షూటింగ్ కూడా పూర్తయినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయాన్ని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించలేదు. రితికా సింగ్ గతంలో దుల్కర్ సల్మాన్ నటించిన 'కింగ్ ఆఫ్ కోత' సినిమాలో ప్రత్యేక పాటలో కనిపించింది. ఇప్పుడు చిరంజీవి సినిమాలోనూ స్పెషల్ సాంగ్ చేస్తే అభిమానులకు మరో ఆకర్షణగా మారే అవకాశం ఉంది. మెగాస్టార్‌తో కలిసి ఆమె వేసే స్టెప్పులు ఎలా ఉంటాయన్న ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా తమన్ మాస్ బీట్‌కు చిరంజీవి డ్యాన్స్ తోడైతే థియేటర్లలో అభిమానులకు పండగే అని చెప్పొచ్చు. ఈ సినిమాలో మరో ప్రత్యేక ఆకర్షణ బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్. ఆయన ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. అలాగే మలయాళ నటి అనస్వర రాజన్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. చిరంజీవి ద్విపాత్రాభినయ ఛాయలున్న పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు బాబీ ఈసారి మెగాస్టార్‌ను సరికొత్త గ్యాంగ్‌స్టర్ లుక్‌లో చూపించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన బాబీ, ఈ సినిమాతో మరోసారి సంక్రాంతి బరిలో మెగాస్టార్‌కు విజయాన్ని అందించాలని భావిస్తున్నారు.

ఓటీటీలోకి తరుణ్ భాస్కర్ 'క్రేజీ కళ్యాణం'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!



టాలీవుడ్ యంగ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్, టాలెంటెడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'క్రేజీ కళ్యాణం'. భద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో నరేష్, అఖిల్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. పూర్తి వినోదాత్మకంగా సాగే ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్ అధికారికంగా లాక్ అయింది.ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫాం 'ఆహా' వేదికగా నవంబర్ 20, 2026 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ భాషలోనూ ఈ సినిమా ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. థియేటర్లలో ప్రేక్షకులను అలరించిన ఈ ఫ్యామిలీ మూవీని త్వరలోనే మీ ఇంటి వద్దే 'ఆహా'లో వీక్షించవచ్చు.

14 ఏళ్లు ప్రేమించుకొని బ్రేకప్ చెప్పుకున్నాం..

సినిమా తారల ప్రేమకథలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. అందరి లాగే వారి జీవితాల్లోనూ ఎన్నో ఎత్తుపల్లాలు, ఊహించని మలుపులు ఉంటాయి. టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్, వ్యాపారవేత్త గౌతమ్ కిచ్లుల ప్రేమ ప్రయాణం కూడా సరిగ్గా అలాంటిదే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కాజల్, తమ 14 ఏళ్ల ప్రేమ, మధ్యలో ఎదురైన బ్రేకప్, పెళ్లికి ముందు తాను పెట్టిన షరతు గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తమ ప్రేమ గురించి కాజల్ మాట్లాడుతూ.. "సుమారు 13-14 ఏళ్ల క్రితమే మేమిద్దరం ప్రేమించుకున్నాం. కానీ అప్పట్లో మా పరిస్థితులు అనుకూలించకపోవడంతో విడిపోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ఎవరి జీవితాల్లో వారు బిజీ అయిపోయాం. ఇద్దరం వేర్వేరు వ్యక్తులతో డేటింగ్ కూడా చేశాం" అని నిజాయితీగా చెప్పారు.వేరే వ్యక్తులతో రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడే, తమ ఇద్దరి మధ్య ఉన్న ప్రత్యేకమైన బంధం ఏంటో వారికి అర్థమైందట. "బహుశా ఒకరి విలువ మరొకరికి తెలియడానికే మేము వేరే వాళ్లతో డేటింగ్ చేశామేమో.! చివరకు విధి మమ్మల్ని మళ్లీ కలిపింది. మా దారులు ఒక్కటయ్యాయి" అంటూ కాజల్ నవ్వుతూ చెప్పుకొచ్చారు. రెండోసారి దగ్గరైన తర్వాత, ఈసారి బంధం విషయంలో ఎలాంటి అస్పష్టత ఉండకూడదని కాజల్ గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకే గౌతమ్‌కు నేరుగా ఒక అల్టిమేటం ఇచ్చారట. "నేను గౌతమ్‌తో ఒకటే మాట చెప్పాను.. 'ఓకే బాస్, ఈసారి మనం కచ్చితంగా పెళ్లి చేసుకోవాలి, లేదంటే శాశ్వతంగా గుడ్‌బై చెప్పుకోవాలి' అని తేల్చి చెప్పేశాను" అని కాజల్ వివరించారు. గౌతమ్ కూడా అదే ఆలోచనతో ఉండటంతో వీరి పెళ్లికి మార్గం సుగమమైంది. ఇరు కుటుంబాల అంగీకారంతో 2020 అక్టోబర్ 30న ముంబైలో అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం ఘనంగా జరిగింది. 2022 ఏప్రిల్‌లో వీరికి కుమారుడు 'నీల్' జన్మించాడు. ప్రస్తుతం ఒకవైపు తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మరోవైపు పాన్ ఇండియా సినిమాల్లో వరుస అవకాశాలతో కాజల్ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. నిజమైన ప్రేమ ఎక్కడికి వెళ్లినా తిరిగి తన గమ్యాన్ని చేరుకుంటుందనేందుకు కాజల్-గౌతమ్ జంట ఒక చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.

కిరణ్ అబ్బవరం 'రియాలిటీ'పై హైప్ పెంచేస్తున్న సాంగ్స్



హిట్టు ఫ్లాపులతో సంబంధం లేకుండా కంటెంట్‌ను నమ్మి సినిమా చేసే యాక్టర్లలో ఒకరు కిరణ్ అబ్బవరం . ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న తాజా సినిమా రియాలిటీ . సినిమా హిట్టవ్వాలంటే మ్యూజిక్ కూడా చాలా ముఖ్యమని తెలిసిందే. పాటలు బ్లాక్ బస్టర్ అయ్యాయంటే సినిమా దాదాపు హిట్టయినట్టేనని చెప్పొచ్చు. ఇప్పుడు రియాలిటీ మూవీ కూడా ఇదే లైన్‌లో వెళ్తూ టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలుస్తోంది.ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన భజ గోవిందం పాట తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా మార్మోగిపోతూ ట్రెండింగ్‌లో నిలుస్తూ.. సినిమాకు సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. మరో సాంగ్ =ఔష్ఠబల కూడా మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమాపై రెండు పాటలు క్యూరియాసిటీ అమాంతం పెంచేస్తున్నాయి. ఈ మూవీ డిసెంబర్ 25న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇక థీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేసిన మూడో పాట రఘుకుల తిలక రా రా కూడా అందరినీ ఇంప్రెస్ చేయడం పక్కా అని మూవీ లవర్స్ చర్చించుకుంటున్నారు. కొన్నాళ్లుగా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న కిరణ్ అబ్బవరానికి రియాలిటీ ఎలాంటి సక్సెస్ అందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. కిరణ్ అబ్బవరం రైటర్ కమ్ డైరెక్టర్‌గా వస్తోన్న ఈ చిత్రంలో దేవికా భట్ మీరోయిన్‌గా నటిస్తోంది. శరత్ కుమార్, సాయి కుమార్, రోహిని, అన్నపూర్ణమ్మ, సుదర్శన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జోయ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో సుధాకర్ చాగంటి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సురేశ్ యెర్ర కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

ప్రశాంత్ నీల్ హారర్ థ్రిల్లర్ '418'ను థియేటర్లలో మిస్సయ్యారా..?



టాలీవుడ్ టాప్ బ్యానర్లలో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్ కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం 418 . హారర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో పతంగ్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఇంటర్నెట్, సోషల్ మీడియా పర్సనాలిటీ ప్రీతి పగడాల లీడ్ రోల్‌లో నటించగా.. చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ కీలక పాత్రలు పోషించారు.ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కిన ఈ మూవీని కీర్తన్ నాదగౌడ డైరెక్ట్ చేశారు. అక్టోబర్ 26న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలై ఈ చిత్రానికి మిక్స్‌డ్ రివ్యూస్ రాబట్టుకుంది. అయితే థియేటర్లలో ఈ సినిమాను మిస్సయిన వారి కోసం ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. 418 ఇక ఓటీటీలోనూ సందడి చేయనుంది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో నవంబర్ 19 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీ పలు ప్రధాన భారతీయ భాషల్లో అందుబాటులో ఉండనుంది. మరి ఓటీటీలో ఈ చిత్రానికి ఎలాంటి స్పందన వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రం సూర్య రాజ్, శషాంక్ పాటిల్, రమేశ్ ఇందిర ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. దినేశ్ దినకరన్, సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన ఈ చిత్రానికి వెంకీ జీజీ మ్యూజిక్ కంపోజర్‌గా వ్యవహరించాడు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com